Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు
# RAJADHANI VARTALU




అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue) : 292 పేజీలు (Pages) : 8 వెల : రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)
ఆదివారం, 5 - 7 - 2026
94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com NI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం : 2015

# 50 ఏళ్ల ఆప్కో... నేతన్నల జీవితాలకు అండగా నిలిచిన ఓ బలమైన సహకార ఉద్యమం

## - సాంప్రదాయ చేనేతకు సంరక్షణతో వేలాది నేత కుటుంబాలకు భరోసా
## - ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో చేనేత రంగానికి కొత్త ఊపు








**అమరావతి, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ చేనేత పారిశ్రామికుల సహకార సంఘం (ఆప్కో) జూలై 6న స్వర్ణోత్సవాన్ని జరుపుకో నుంది. ఇది కేవలం ఒక ప్రభుత్వ సంస్థగా అర్థ శతాబ్దం వేడుక మాత్రమే కాదు... రాష్ట్ర చేనేత సంప్రదాయాన్ని కాపాడుతూ, వేలాది నేత కుటుంబాలకు ఉపాధి, ఆర్థిక భరోసా కల్పించిన ఐదు దశాబ్దాల ప్రయాణానికి గుర్తుగా నిలిచే చారిత్రక సందర్భం. 1976 జూలై 6న హైకో ఫ్యాబ్రిక్స్, రాయా ఫ్యాబ్రిక్స్, ఆంధ్ర హ్యాండ్లూమ్స్ అనే మూడు ప్రాంతీయ సంస్థలను విలీనం చేసి ఆప్కోను ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రాథమిక చేనేత సహకార సంఘాల ద్వారా తయారయ్యే ఉత్పత్తులకు మార్కెట్ కల్పించడం, నేతలకు నిరంతర ఉపాధి కల్పించడం, వారి ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచడం, సంప్రదాయ చేనేత కళను పరిరక్షించడం ప్రధాన లక్ష్యంగా ఆప్కో కొనసాగుతోంది. ఐదు దశాబ్దాల కాలంలో ఆప్కో దేశంలోనే ప్రముఖ చేనేత మార్కెటింగ్ సంస్థగా ఎదిగింది. ప్రస్తుతం రాష్ట్రంలోని వెయ్యికి పైగా ప్రాథమిక చేనేత సహకార సంఘాల ఉత్పత్తులను సేకరించి దేశవ్యాప్తంగా సుమారు 80 విక్రయ కేంద్రాల ద్వారా వినియోగదారులకు అందిస్తోంది. కాలానుగుణంగా ఈ-కామర్స్, డిజిటల్ మార్కెటింగ్‌ను కూడా అందిపుచ్చుకుని ప్రపంచవ్యాప్తంగా వినియోగదారులకు చేరువయ్యింది.

**చంద్రబాబు నాయకత్వంలో చేనేతకు కొత్త ప్రోత్సాహం**

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం చేనేత రంగానికి కొత్త ఊపునిస్తోంది. నేతన్నల ఆదాయం పెంచడం, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడం, సంప్రదాయ చేనేతకు మార్కెట్ విస్తరించడం లక్ష్యంగా పలు నిర్ణయాలు తీసుకుంది. ఉచిత విద్యుత్ సదుపాయం కల్పించింది. 2025లో ఆప్కో బ్లీచింగ్, డైయింగ్ చార్జీలను గణనీయంగా పెంచింది. బెడ్‌షీట్లు, టవళ్లను నేసే చేనేత కార్మికుల రోజువారీ కూలీలను కూడా పెంచింది. ఈ మార్పుల వల్ల ఒక్కో నేతకు రోజుకు సగటున రూ.108 అదనపు ఆదాయం లభిస్తోంది. పెరుగుతున్న ముడిసరుకు ధరలు, విద్యుత్ చార్జీలు, ద్రవ్యోల్బణం నేపథ్యంలో ఈ నిర్ణయం నేత కుటుంబాలకు గణనీయమైన ఊరటనిచ్చింది. అదే సమయంలో ప్రభుత్వ శాఖలు, సంక్షేమ హాస్టళ్లు, విద్యాసంస్థలకు అవసరమైన యూనిఫాంలు, బెడ్డింగ్ మెటీరియల్ వంటి వస్త్రాల కొనుగోళ్లను ఆప్కో ద్వారా చేపడుతూ వేలాది మంది నేతలకు నిరంతర ఉపాధి కల్పిస్తోంది.

**ఐదు దశాబ్దాల ప్రయాణంలో కీలక భూమిక పోషించిన రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు**

ఆప్కో ఎదుగుదలలో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల సహకారం మరువలేనిది. నాటి ముఖ్యమంత్రి దివంగత నందమూరి తారక రామారావు తన హయాంలో ప్రవేశపెట్టిన 'జనతా వస్త్రాలు' పథకం ద్వారా చేనేత ఉత్పత్తులకు భారీ మార్కెట్ లభించింది. అనంతరం నేషనల్ కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్‌సీడీసీ) నుంచి రుణాలు, ఏపీ కోఆపరేటివ్ బ్యాంకు ద్వారా వర్కింగ్ క్యాపిటల్, రాష్ట్ర-కేంద్ర ప్రభుత్వాల రిబేట్ పథకాలు, ప్రభుత్వ శాఖల నుంచి భారీ కొనుగోళ్లు ఆప్కో అభివృద్ధికి బలాన్నిచ్చాయి. జాతీయ హ్యాండ్లూమ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్‌హెచ్‌డీసీ) ద్వారా నూలు సరఫరాను చేపట్టి , ప్రాథమిక చేనేత సహకార సంఘాలకు అందించడం ద్వారా ఉత్పత్తి నిరంతరంగా కొనసాగేందుకు ఆప్కో కీలక పాత్ర పోషిస్తోంది.

**సంప్రదాయ చేనేత సంరక్షణలో ఆప్కో**

ధర్మవరం పట్టుచీరలు, వెంకటగిరి చీరలు, ఉప్పాడ జామ్‌దాని, మంగళగిరి వస్త్రాలు, చిరాల, బందరు నేయ్యులు, పొందూరు ఖాదీ వంటి రాష్ట్ర ప్రత్యేక చేనేత ఉత్పత్తులను దేశవ్యాప్తంగా గుర్తింపు పొందేలా చేయడంలో ఆప్కో విశేష కృషి చేసింది. ముఖ్యంగా వెనుకబడిన శ్రీకాకుళం జిల్లాలోని చేనేత సహకార సంఘాల నుంచి నిరంతరం ఉత్పత్తులు కొనుగోలు చేస్తూ నేత కుటుంబాలకు అండగా నిలుస్తోంది. అలనాడు గాంధీజీ ప్రశంసలు పొందిన పొందూరు ఖాదీ నేడు కేంద్ర ప్రభుత్వం గుర్తించిన 'వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్ట్'లో చోటు దక్కించుకోవడం విశేషం.

**నేతన్నే ఆప్కోకు బలం**

ఆప్కో విక్రయించే ప్రతి చీర వెనుక, ప్రతి వస్త్రం వెనుక, ప్రతి తువ్వాలు, బెడ్‌షీట్ వెనుక ఒక నేత కుటుంబం శ్రమ, నైపుణ్యం, తరతరాలుగా సంక్రమించిన కళ దాగి ఉంది. ఆ కళాకారులే ఈ సంస్థకు అసలైన బలం. ఈ క్రమంలో ప్రతి ఏడాది ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవాన్ని నిర్వహిస్తూ చేనేత రంగ ప్రాధాన్యాన్ని ప్రజలకు చేరవేస్తోంది. ఆప్కో తన అన్ని విక్రయ కేంద్రాల్లో కంప్యూటరైజ్డ్ ఆన్‌లైన్ బిల్లింగ్ వ్యవస్థను అమలు చేసింది. దీంతో బిల్లింగ్ ప్రక్రియ వేగవంతమై, కస్టమర్లు ఎక్కువసేపు వేచి ఉండాల్సిన అవసరం తగ్గింది. అదే సమయంలో వస్త్రాల నిల్వ వివరాలు (ఇన్వెంటరీ) తక్షణమే నవీకరించబడే విధానం అమల్లోకి రావడంతో పారదర్శకత పెరగడమే కాకుండా, మానవ తప్పిదాలు కూడా గణనీయంగా తగ్గాయి. ఈ వినూత్న సంస్కరణకు గుర్తింపుగా 2025లో న్యూఢిల్లీ వేదికగా జరిగిన స్కోచ్ సమ్మిట్లో ఆప్కోకు ప్రతిష్ఠాత్మక స్కోచ్ అవార్డు-2025 లభించింది.

**భవిష్యత్ లక్ష్యం**

స్వర్ణోత్సవాన్ని పురస్కరించుకుని చేనేత వారసత్వ పరిరక్షణ, ప్రతి నేత కుటుంబ సాధికారత, సంప్రదాయ నైపుణ్యాల సంరక్షణ, ఆధునిక మార్కెటింగ్ అవకాశాల వినియోగం, యువతను చేనేత రంగం వైపు ఆకర్షించడం వంటి లక్ష్యాలతో ఆప్కో ముందుకు సాగుతోంది. ఐదు దశాబ్దాలుగా వేలాది నేత కుటుంబాలకు అండగా నిలుస్తూ, సంప్రదాయాన్ని సజీవంగా ఉంచుతూ, చేనేతకు మార్కెట్ కల్పిస్తూ సాగుతున్న ఆప్కో ప్రయాణం... ఆంధ్రప్రదేశ్ చేనేత చరిత్రలో ఒక స్ఫూర్తిదాయక అధ్యాయంగా నిలిచిపోయింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చేనేత సహకార సంఘం (ఆప్కో) స్వర్ణోత్సవ వేడుకలు సోమవారం సాయంత్రం 4 గంటలకు గుంటూరు జిల్లా మంగళగిరి సమీపంలోని ఎర్రబాలెంలోని ఆప్కో సముదాయంలో ఘనంగా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఐటీ, హెచ్ఆర్‌డీ, ఎలక్ట్రానిక్స్ & రియల్ టైమ్ గవర్నెన్స్ శాఖ మంత్రి నారా లోకేష్ ప్రత్యేక ముఖ్య అతిథిగా, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత ముఖ్య అతిథిగా హాజరవుతారు. రాష్ట్ర ప్రభుత్వ చేనేత-హస్తకళల అభివృద్ధి గౌరవ సలహాదారు డాక్టర్ సుచిత్ర ఎల్లా, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పీ. సిసోడియా, చేనేత & జౌళి శాఖ కమిషనర్ జి.రేఖారాణి, సంస్థ వైస్ చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్ కె. కన్నబాబు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు.


# రూ. 118 కోట్లతో ఆధునిక బస్ స్టేషన్, డిపో నిర్మాణానికి శంకుస్థాపన

## - కుప్పంలో కొత్త ఆధునిక బస్ స్టేషన్‌కు శంకుస్థాపన చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు






**కుప్పం, (రాజధాని వార్తలు):** శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి మండిపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి, చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద రావు, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ మునిరత్నం, కుప్పం స్థానిక నేతలు, చిత్తూరు జిల్లా అధికారులు తదితరులు. కుప్పం బస్ స్టేషన్ శంకుస్థాపన అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ...గతంలో ఎన్టీఆర్ హయాంలో ఆర్టీసీ బస్ స్టేషన్ కు శంకుస్థాపన చేశారు... మళ్లీ ఇప్పుడు మోడల్ బస్ స్టేషన్, డిపోకు శ్రీకారం చుట్టాం. సోలార్ విద్యుత్ వినియోగించుకునేలా ఆర్టీసీ బస్ డిపోలో సోలార్ ప్యానెళ్లను ఏర్పాటు చేస్తున్నాం. స్వర్ణ కుప్పం లక్ష్యాన్ని సాధించడానికి మార్గం సుగమం అయ్యేలా పరిశ్రమలు తెస్తున్నాం. ఉద్యోగాల కోసం కుప్పానికి రావాలే తప్ప.. కుప్పం నుంచి వలసలు ఉండకూడదనే లక్ష్యంతో పని చేస్తున్నాం. నిన్న ఒక్కరోజులోనే 30 ప్రాజెక్టులు, రూ.9,322 కోట్ల పెట్టుబడులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు, ఎంఓయూలు చేసుకున్నాం. ఈ పెట్టుబడుల ద్వారా సుమారు 80 వేల మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి లభిస్తుంది. కుప్పం అభివృద్ధికి ఇవి దోహదపడతాయి. అడిడాస్ ఫుట్ వేర్ సంస్థ కోసం ఎన్నో రాష్ట్రాలు ప్రయత్నించాయి.. కానీ ఆ సంస్థ కుప్పానికే వచ్చింది. టూ సీటర్ ట్రైనీ ఎయిర్ క్రాఫ్ట్ తయారీ పరిశ్రమ కూడా కుప్పానికి వచ్చింది. డెయిరీ, ఫుడ్ ప్రాసెసింగ్, పౌల్ట్రీ పరిశ్రమలు వచ్చాయి. గతంలో కుప్పంలో ప్రారంభించిన మైక్రో ఇరిగేషన్ ఇప్పుడు దేశానికే ఆదర్శం. రాష్ట్రానికి మైక్రో ఇరిగేషన్ శ్రీరామరక్ష. కుప్పంలో 10 లక్షల లీటర్ల పాలను సరఫరా చేసే లక్ష్యంతో డెయిరీలు వచ్చాయి. కుప్పంలో వాణిజ్య పంటలకు పెద్దపీట వేయాలి. పూర్వోదయ ప్రాజెక్టు ద్వారా ఉద్యాన పంటలతో సీమను అభివృద్ధి చేస్తాం. వచ్చే నెలలో మదనపల్లెలో పూర్వోదయ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేస్తాం. కుప్పానికి హంద్రీ-నీవా కాలువ ద్వారా నీళ్లు తెచ్చాం...110 చెరువులు నింపాం. బెంగళూరు కంటే మంచి వాతావరణం కుప్పంలో ఉంది. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు సోలార్ రూఫ్ టాప్ ద్వారా విద్యుత్ ఉచితంగా ఇస్తున్నాం. అలాగే రూ. 552 కోట్లతో బీసీలు, ఓసీల ఇళ్లపై సోలార్ రూఫ్ టాప్ ద్వారా విద్యుత్ అందిస్తాం. నెట్ జీరో విధానం ద్వారా తాజా కూరగాయలు మిద్దెల పైనే పెంచుకునే విధానాన్ని అవలంబించాలి. ఈ-సైకిళ్లను పెద్ద ఎత్తున వినియోగించటం ద్వారా కాలుష్య రహిత వాతావరణాన్ని తీసుకువద్దాం. కుప్పంలో పెట్రోల్, డీజిల్ వినియోగాన్ని పక్కన పెట్టి.. సోలార్ విద్యుత్ వాడకం పైనే పూర్తిగా జీవనం సాగించాలి. కుప్పంలో లభించే బ్లూ గ్రానైట్ కు మార్కెట్టులో మంచి డిమాండ్ ఉంది... అందుకే హెరిటేజ్ గ్రానైట్ క్లస్టర్ ఏర్పాటు చేస్తున్నాం. కుప్పం నియోజకవర్గంలో అన్ని ప్రాంతాల్లో మొబైల్ కనెక్టివిటీ ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. రాష్ట్రంలో తిరుమల తర్వాత ఎక్కువ గ్రీన్ కవర్ ఉన్న ప్రాంతం కుప్పమే. దీనిని కొనసాగిస్తూ పర్యావరణాన్ని కాపాడదాం. ఎల్ నినో వల్ల ఈ ఏడాది వర్షాలు పడడం లేదు. నదుల్లో నీళ్లు లేవు. రిజర్వాయర్లకు నీళ్లు రావడం కష్టమయ్యే పరిస్థితి కన్పిస్తోంది. కుప్పం ఏరియా ఆస్పత్రిలో సీటీ స్కాన్ సెంటర్ ఏర్పాటు చేశాం...డయాలసిస్ సెంటర్ ను విస్తరించాం. ప్రజారోగ్యాన్ని కాపాడేందుకు ప్రపంచంలోని అత్యున్నత వైద్యారోగ్య పద్ధతులు అన్నింటిని అందుబాటులోకి తెస్తాం.




# ప్రభుత్వ డేటా భద్రత.. ఏపీటీఎస్ ఆధ్వర్యంలో సైబర్ సెక్యూరిటీ వర్క్‌షాప్

**ఇంటర్నెట్ డెస్క్:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ శాఖల్లో అమలవుతున్న సైబర్ సెక్యూరిటీ వ్యవస్థలను సమీక్షించి, రాష్ట్ర ప్రభుత్వ డేటా భద్రతను మరింత బలోపేతం చేసే దిశగా ఏపీటీఎస్ ఆధ్వర్యంలో సైబర్ సెక్యూరిటీ వర్క్‌షాప్ తాజాగా జరిగింది. 'రాష్ట్ర డేటా భద్రత కోసం ప్రభుత్వ వ్యవస్థల్లో సైబర్ సెక్యూరిటీ ఫ్రేమ్‌వర్క్‌ల బలోపేతం' అంశంపై ఆంధ్రప్రదేశ్ సచివాలయంలో ఈ వర్క్‌షాప్ జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహన కృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అన్ని ప్రభుత్వ సేవలను వేగంగా డిజిటలైజ్ చేస్తోందని తెలిపారు. ఈ నేపథ్యంలో పౌరుల వ్యక్తిగత సమాచారం, ఆరోగ్య వివరాలు, విద్య, భూ రికార్డులు, సంక్షేమ పథకాలు, ఆర్థిక లావాదేవీల వంటి అత్యంత కీలకమైన ప్రభుత్వ డేటాను రక్షించడం ప్రభుత్వ అత్యున్నత బాధ్యతగా మారిందని మన్నవ మోహన కృష్ణ పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రతి ప్రభుత్వ శాఖ ప్రస్తుతం సైబర్ భద్రతను ఏ విధంగా అమలు చేస్తోంది? ఎలాంటి సవాళ్లు ఎదుర్కొంటోంది? వాటిని అధిగమించేందుకు ఎలాంటి ఆధునిక భద్రతా వ్యవస్థలు అవసరమనే అంశాలపై ఈ వర్క్‌షాప్‌లో విస్తృతంగా చర్చించినట్లు మన్నవ మోహన కృష్ణ తెలిపారు. అన్ని శాఖల్లో అత్యుత్తమ సైబర్ సెక్యూరిటీ ప్రమాణాలు అమలు చేయడం, డేటా భద్రతను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దడం, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ ఫ్రేమ్‌వర్క్‌ను మరింత బలోపేతం చేయడమే ఈ సమావేశం ప్రధాన ఉద్దేశ్యమని అన్నారు. సైబర్ దాడుల స్వరూపం రోజురోజుకూ మారుతున్న నేపథ్యంలో ప్రభుత్వ శాఖలు సాంకేతిక పరిజ్ఞానం పెంచుకోవడంతో పాటు నిరంతర పర్యవేక్షణ, శిక్షణ, అవగాహన, వేగవంతమైన స్పందన వ్యవస్థలపై కూడా దృష్టి పెట్టాలని ఆయన సూచించారు. సురక్షితమైన డిజిటల్ పాలన ద్వారా ప్రజల విశ్వాసాన్ని మరింత పెంపొందించడమే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. భారతదేశంలో సైబర్ మోసాలు అరికట్టటానికి రాష్ట్ర ప్రభుత్వాలతో సమన్వయం చేసు కుంటూ కేంద్ర ప్రభుత్వం వివిధ రాష్ట్రాల్లో సమీక్షలు నిర్వహిస్తోందని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కూడా నేషనల్ సైబర్ సెక్యూరిటీ టీంతో కలిసి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు.

# మంత్రి లోకేష్‌కు దక్షిణ కొరియా ఆహ్వానం!

## - ఈ నెల 5 నుంచి 11 వరకు కొరియా పర్యటన
## - అధికారిక సమావేశాలతోపాటు పెట్టుబడి చర్చలు




**అమరావతి, (రాజధాని వార్తలు):** భారత్ – దక్షిణ కొరియా మధ్య ద్వైపాక్షిక సంబంధాలు బలోపేతం చేసేందుకు తమ దేశంలో పర్యటించాల్సిందిగా రిపబ్లిక్ ఆఫ్ కొరియా (దక్షిణ కొరియా) ఏపీ విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్‌ను ఆహ్వానించింది. వారి ఆహ్వానం మేరకు ఈనెల 5 నుంచి 11వ తేదీ వరకు ఆరు రోజులపాటు మంత్రి లోకేష్ దక్షిణ కొరియాలో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో మంత్రి లోకేష్ కొరియాలో వివిధ మంత్రిత్వశాఖల ప్రతినిధులతో అధికారిక సమావేశాల్లో పాల్గొంటారు. ద్వైపాక్షిక సహకారాన్ని పెంపొందించే లక్ష్యంతో ఈ అధికారిక సమావేశాలను నిర్వహిస్తున్నామని దక్షిణ కొరియా కాన్సులేట్ జనరల్ (చెన్నయ్) చాంగ్ న్యూన్ కిమ్ మంత్రి లోకేష్‌కు రాసిన లేఖలో పేర్కొన్నారు. ఇరుదేశాల నడుమ మరింత సహకారం, సంబంధాల బలోపేతం ఈ పర్యటన కీలక అడుగు కాగలదని భావిస్తున్నట్లు కిమ్ తెలిపారు. ఈనెల 5వ తేదీన దక్షిణ కొరియా రాజధాని సియోల్‌లో ఇండియా డయాస్పోరా ఆత్మీయ సమావేశానికి హాజరై అక్కడి భారతీయులు, తెలుగువారిని ఉద్దేశించి ప్రసంగిస్తారు. 6వ తేదీన దక్షిణ కొరియా టెక్ స్టార్టప్ సంస్థల ప్రతినిధులతో రౌండ్ టేబుల్ సమావేశంతోపాటు వివిధ సంస్థలతో పెట్టుబడి చర్చల్లో పాల్గొంటారు. అనంతరం హ్యోసంగ్ భారీపరిశ్రమ సంఘం అధ్యక్షుడు టకేషి యొకోటా, సియోల్ సెమికండక్టర్స్ వైస్ ప్రెసిడెంట్ టేహ్యాంగ్ లీతో సమావేశమవుతారు. 7వతేదీన ఎల్జీ కెమ్ గ్లోబల్ గ్లోబల్ స్ట్రాటజీ సెంటర్ ప్రెసిడెంట్, ఎల్జీ ఓవర్ సీస్ కంపెనీస్ హెడ్ యున్ జు కోహ్ ఎల్జీ టవర్స్‌లో ఏర్పాటుచేసిన విందు సమావేశంలో పాల్గొంటారు. ఎల్జీ అనుబంధ సంస్థలకు చెందిన ఉన్నత స్థాయి ప్రతినిధి బృందాలు ఈ సమావేశానికి హాజరుకానున్నాయి. 8వతేదీన కొరియన్ మెరైన్ అక్విప్ మెంట్ అసోసియేషన్ ప్రతినిధులతో రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొంటారు. 9వతేదీన కొరియన్ పొలిటికల్ ఎఫైర్స్ డిప్యూటీ మినిస్టర్ మిస్. యుయి–హే సిసిలియా చుంగ్‌తో భేటీ అవుతారు. అనంతరం కొరియన్ ఇంటర్నేషనల్ ట్రేడ్ & ఇన్వెస్టిమెంట్స్ డిప్యూటీ మినిస్టర్ కాంచన్ కాంగ్‌తో సమావేశమవుతారు. 10వ తేదీన వివిధ సంస్థల ప్రతినిధులతో పెట్టుబడి చర్చలతోపాటు కొరియా ఆటో ఇండస్ట్రీ కోఆపరేషన్ ఏజెన్సీ ప్రతినిధులతో రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరవుతారు. అదేరోజు రాత్రి సిఐఐ పార్టనర్ షిప్ సమ్మిట్–2026 విజయవంతం చేయాలని కోరుతూ కొరియా కంపెనీల ప్రతినిధులతో రోడ్ షోలో పాల్గొంటారు.

# సంజీవని ప్రాజెక్టు అమలు తీరుపై సీఎం చంద్రబాబు ఆరా



**కుప్పం / అమరావతి, (రాజధాని వార్తలు):** కుప్పంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన రెండో రోజు కొనసాగుతోంది. ఈ సందర్భంగా వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కుప్పం ఏరియా ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన సీటీ స్కాన్, డయాలసిస్ సెంటర్లను చంద్రబాబు ప్రారంభించారు. సీటీ స్కాన్ ద్వారా రోజూ ఎంత మందికి సేవలు అందుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజూ 30 నుంచి 40 మందికి పరీక్షలు చేసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. కుప్పం ఏరియా ఆస్పత్రిని సందర్శించి.. వ్యర్థాలను వదిలే యడంపై ఆరా తీశారు. చెత్తను వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. సంజీవని కార్యక్రమంలో డేటా అనుసంధానమనేది ముఖ్యమని చంద్రబాబు వెల్లడించారు. హెల్త్ రికార్డులు డిజిటలైజ్ చేయడంతోపాటు.. ప్రతి అంశంలోనూ డేటా ఇంటిగ్రేషన్ చేయాలని ఆదేశించారు. డయాలసిస్ వార్డును సందర్శించగా.. పొరుగు రాష్ట్రాల నుంచి కూడా కుప్పం ఏరియా ఆస్పత్రికి డయాలసిస్ నిమిత్తం వస్తున్నారని అధికారులు తెలిపారు. సంజీవని ప్రాజెక్టు అమలు తీరుపై ముఖ్యమంత్రి ఆరా తీశారు. సంజీవని ప్రాజెక్టు ద్వారా ప్రజలు సంతృప్తి చెందాలని.. కుప్పంలో ఏ మేరకు ప్రజలకు మేలు కలిగిందనే వివరాలను సిద్ధం చేయాలని ఆదేశించారు. కుప్పం ఏరియా ఆస్పత్రిలో పంచతత్వ కాన్సెప్టుతో ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్ పరిశీలించిన ముఖ్యమంత్రి.. ఆపై మొక్క నాటారు. కుప్పం ఏరియా ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను పరిశీలించారు. గంజాయి, డ్రగ్స్ బారిన పడ్డవారికి మెడిటేషన్ ద్వారా ఆరోగ్యం మెరుగుపడేలా సహకారం అందిస్తున్నట్టు సీఎంకు బ్రహ్మకుమారీ సంస్థ ప్రతినిధులు వివరించారు. డ్రగ్స్, గంజాయి వంటి వాటిని నివారించేలా మరింత కఠినంగా ఉండాలని పోలీసు ఉన్నతాధికారులకు సీఎం ఆదేశాలు జారీ చేశారు. రోడ్డు ప్రమాదాల సమయంలో వైద్యులకు తక్షణ సమాచారం అందించేలా ఓ ఎక్విప్మెంట్‌ను రూపొందించిన బాలుడిని సీఎం అభినందించారు. కుప్పం నగరంలో ఏర్పాటు చేసిన స్వర్ణ కుప్పం–స్వచ్ఛ కుప్పం ఎంట్రన్స్ ఆర్చ్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, చిత్తూరు జిల్లా ప్రజాప్రతినిధులు, కుప్పం స్థానిక నేతలు, చిత్తూరు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఆదివాసీల హక్కుల కోసం అల్లూరి పోరాడారు : పల్లా శ్రీనివాసరావు

**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** మన్యం వీరుడు అల్లూరి సీతా రామరాజు త్యాగం, ధైర్యసాహసాలు, దేశభక్తి భావం భావితరాలకు స్ఫూర్తిదాయకమని తెలుగుదేశం పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు కొనియాడారు. ఆదివాసీల హక్కుల కోసం పోరాడి బ్రిటిష్ పాలనకు సవాల్ విసిరిన మహావీరుడిగా అల్లూరి చరిత్రలో చిరస్థాయిగా నిలిచారని వ్యాఖ్యానించారు. అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా శనివారం గాజువాకలోని ఆయన విగ్రహానికి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. అల్లూరి ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని దేశ, సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పల్లా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు.

**స్వామి వివేకానంద.. యువతలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించారు:పల్లా శ్రీనివాసరావు**

అలాగే, గాజువాకలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో స్వామి వివేకానంద వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి టీడీపీ ఏపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఘన నివాళులు అర్పించారు. యువతలో ఆత్మవిశ్వాసం, దేశభక్తి, సేవాభావాన్ని పెంపొందించిన మహనీయుడు స్వామి వివేకానంద అని కొనియాడారు. వివేకానంద చూపిన మార్గం నేటి సమాజానికి స్ఫూర్తిదాయకమని ప్రశంసించారు. యువత వివేకానంద ఆశయాలను ఆదర్శంగా తీసుకుని దేశాభివృద్ధికి తమ వంతుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

**కొణిజేటి రోశయ్య.. ప్రజాసేవ పట్ల అంకితభావంతో పనిచేశారు**

మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య జయంతి సందర్భంగా



పల్లా శ్రీనివాసరావు ఘన నివాళులు అర్పించారు. నిజాయితీ, నిరాడంబరత, ఆర్థిక క్రమశిక్షణతో కూడిన రాజకీయాలకు రోశయ్య ఆదర్శప్రాయమని కొనియాడారు. ప్రజా సమస్యలపై అపారమైన అవగాహన, శాసనసభలో ఆయన చూపిన ప్రతిభ చిరస్మరణీయమని వ్యాఖ్యానించారు. ప్రజాసేవ పట్ల అంకితభావంతో పనిచేసిన నాయకుడిగా రోశయ్య సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు. నేటి తరానికి రోశయ్య జీవితం, విలువలు స్ఫూర్తిదాయకమని అభిప్రాయపడ్డారు.

# 20 ఏళ్ల రేవంత్ రాజకీయ ప్రస్థానం.. శుభాకాంక్షలు చెప్పిన బండి సంజయ్



**హైదరాబాద్,** (రాజధాని వార్తలు): ప్రజా జీవితంలో రెండు దశాబ్దాలు పూర్తి చేసుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేంద్ర మంత్రి బండి సంజయ్ శుభాకాంక్షలు తెలియజేశారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. కేసీఆర్, రేవంత్‌రెడ్డి ఇద్దరూ కూడా కష్టపడి పైకొచ్చినవారే అని అన్నారు. సీఎం రేవంత్ 6 గ్యారంటీలు అమలు చేయాలని కోరారు. సర్ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపించారు. హిందువుల ఓట్లను తొలగించే కుట్ర జరుగుతోందని కేంద్ర మంత్రి విమర్శించారు. ఇదే జరిగితే తెలంగాణలో హిందువులే మైనారిటీలయ్యే ప్రమాదం ఉందన్నారు. మజ్లిస్‌తో కుమ్మక్కై హిందువుల ఓట్లు తొలగించే కుట్ర జరుగుతోందని మండిపడ్డారు. అధికారులకు ప్రభుత్వం సహకరించడం లేదని బండి సంజయ్ పేర్కొన్నారు.

# మెల్‌బోర్న్ పర్యటనకు ముందు ప్రధాని మోదీకి డెత్ వార్నింగ్



**ఇంటర్నెట్ డెస్క్:** భారత ప్రధాని నరేంద్ర మోదీ త్వరలో ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లనున్న నేపథ్యంలో సోషల్ మీడియా వేదికగా బెదిరింపులు వచ్చాయి. మెల్‌బోర్న్ మీట్స్ మోదీ పేరిట జరగనున్న ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొననున్నారు. ఈ కార్యక్రమాల ప్రమోషన్ కోసం ఉద్దేశించిన ఒక ఫేస్ బుక్ పోస్టుకు కామెంట్ రూపంలో నిందితులు ఈ బెదిరింపులకు దిగారు. అబూ ముస్తాఫా పేరిట ఉన్న అకౌంట్ నుంచి నిందితులు ఈ పోస్టు పెట్టారు. 'స్టేడియం రూఫ్‌టాప్‌ను మూసేస్తే మంచిది. ఈ కార్యక్రమానికి మోదీ రావడ మంటే మృత్యువు కోసం వస్తున్నట్టే' అని కామెంట్ చేశారు. ఈ ఘటనపై ఆస్ట్రేలియా ఫెడరల్ పోలీసులు ఇప్పటికే రంగంలోకి దిగారు. ఏ ఐపీ అడ్రస్ నుంచి ఈ పోస్టు వచ్చిందో గుర్తించారు. అయితే, ఈ ఉదంతంలో ఎవరినైనా అరెస్టు చేశారా? లేదా? అనేది ఇంకా తెలియాల్సి ఉంది. ఈ ఘటనను తీవ్రంగా పరగణిస్తున్నామని ఆస్ట్రేలియా అధికారులు తెలిపారు. పలు దర్యాప్తు సంస్థలు ఈ ఘటనపై వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నాయి. ఇక ప్రధాని మోదీ జులై 8–10 మధ్య ఆస్ట్రేలియాలో పర్యటించనున్నారు. జులై 9న మెల్‌బోర్న్ మీట్స్ మోదీ ఈవెంట్‌లో పాల్గొంటారు. ఈ పర్యటన సందర్భంగా ఆస్ట్రేలియా–ఇండియా వార్షిక సమావేశంలో కూడా మోదీ పాల్గొంటారు. ఈ సమావేశాల గురించి ఆస్ట్రేలియా ప్రధాని ఆంథొనీ అల్బనీస్ ప్రకటించారు. భారత్ ఆస్ట్రేలియాకు గొప్ప వ్యూహాత్మక, ఆర్థిక భాగస్వామి అని అన్నారు.

# ఐదో విడత రైతు భరోసా నిధులు విడుదల

**హైదరాబాద్, (రాజధాని వార్తలు):** తెలంగాణ ప్రభుత్వం రైతు భరోసా పథకం కింద ఐదో విడత నిధులను విడుదల చేసింది. ఈ విడతలో 6 ఎకరాల వరకు సాగుభూమి ఉన్న 1.69 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.545.41 కోట్లను జమ చేసింది. ఇప్పటి వరకు రైతు భరోసా పథకం కింద మొత్తం 67.45 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.7,135.78 కోట్లను ప్రభుత్వం జమ చేసింది. అర్హులైన ప్రతి రైతుకు దశలవారీగా రైతు భరోసా సాయాన్ని అందిస్తున్నట్లు ప్రభుత్వం తెలిపింది. రైతులకు సాగు పెట్టుబడి భారాన్ని తగ్గించి, వ్యవసాయ కార్యకలాపాలకు ఆర్థికంగా అండగా నిలవాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా పథకాన్ని అమలు చేస్తోంది. మిగిలిన అర్హులైన రైతులకు




కూడా త్వరలోనే తదుపరి విడత నిధులను విడుదల చేయనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

# తాడేపల్లి నుంచి ఎంత డబ్బు అందుతోంది?

## - ప్రకాశ్ రాజ్‌పై కందుల దుర్గేశ్ ఫైర్



**అమరావతి, (రాజధాని వార్తలు):** యూట్యూబర్ ప్రశ్న రావణ్ (జోసెఫ్) అరెస్టుల పర్వంపై నటుడు ప్రకాశ్ రాజ్ చేసిన విమర్శలకు ఏపీ పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ ఘాటుగా బదులిచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లో కావాలనే అశాంతిని, ఘర్షణ వాతావరణాన్ని రగిల్చేందుకు ఒక ముఠా ప్రయత్నిస్తోందని ఆయన ఆరోపించారు. మీడియా ముఖంగా ప్రకాశ్‌రాజ్, రావణ్‌లపై విరుచుకుపడిన మంత్రి...వారిద్దరినీ సమాజ విద్రోహ శక్తులుగా అభివర్ణించారు. అసలు ఈ వివాదాస్పద యూట్యూబర్‌తో ప్రకాశ్ రాజ్‌కు ఉన్న చీకటి సంబంధాలేంటో చెప్పాలని డిమాండ్ చేశారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో ఎన్నో అకృత్యాలు సాగాయని, హిందూ దేవాలయాలపై దాడులు జరిగాయని.. అప్పుడు లేవని ప్రకాశ్ రాజ్ గొంతు ఇప్పుడు ఎందుకు లేస్తోందని మంత్రి కందుల దుర్గేశ్ నిలదీశారు. "నాడు మూగ నోము నోమిన మీరు.. నేడు కూటమి ప్రభుత్వంపై విషం చిమ్మడానికి తాడేపల్లి ప్యాలెస్ నుంచి ప్రతి నెలా ఎంత డబ్బు అందుకుంటున్నారు?" అంటూ నేరుగా ప్రశ్నించారు. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం, రాష్ట్రంలో అశాంతిని రేకెత్తించి శాంతి భద్రతలను దెబ్బతీయడానికే ఇలాంటి శక్తులు కుట్రలు పన్నుతున్నాయని, వీటిని ప్రభుత్వం కఠినంగా అణచివేస్తుందని మంత్రి హెచ్చరించారు.

# రాజధాని విషయంలో విధానం లేని నినాదం జగన్‌పై లంకా దినకర్ ఫైర్

**అమరావతి, (రాజధాని వార్తలు):** వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఇరవై సూత్రాల కార్యక్రమాల అమలు చైర్మన్ లంకా దినకర్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. రాజధానిపై జగన్‌కు కనీస అవగాహన లేదన్నారు. 'మావిగన్' తూటా లేని గన్ అని.. అది పేలదంటూ సెటైర్ విసిరారు. 'నిన్న మూడు రాజధానులు మా నినాదం అన్నారు.. ఈరోజు మావిగన్ మా నినాదం అన్నారు.. రేపు ఏమిటో అర్థం కానీ అయోమయం జగన్నాధం మా నినాదం అనే విధంగా జగన్ తీరు ఉంది' అంటూ వ్యాఖ్యా నించారు. ప్రధాని నరేంద్ర మోదీ సంకల్పం వికసిత్ భారత్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ధ్యేయం స్వర్ణ ఆంధ్రప్రదేశ్ అని అన్నారు. జగన్ సంకల్పం, ధ్యేయం మాత్రం వినాశక ఏపీ అంటూ మండిపడ్డారు. డబుల్ ఇంజన్ సర్కార్ నేతృత్వంలో రాష్ట్రం సమగ్ర సమ్మిళిత అభివృద్ధి లక్ష్యంగా దూసుకుపోతోందని లంకా దినకర్ అన్నారు. హార్టికల్చర్ హబ్‌గా 1 లక్ష కోట్ల పెట్టు బడితో రాయలసీమ, మార్కాపురం జిల్లాల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నట్లు తెలిపారు. పోలవరం ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్ జీవనాడిగా, పోలవరం– నల్లమల్ల సాగర్ బొల్లాపల్లి



ద్వార అనుసంధానం చేసి వెలిగొండ ప్రాజెక్ట్ ద్వారా మార్కాపురం, కడప, నెల్లూరు జిల్లాలకు శాశ్వతంగా కరువుకు పరిష్కారం చూపుతున్నట్లు చెప్పారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల సర్వతోముఖాభివృద్ధికి డబుల్ ఇంజిన్ సర్కార్ కృషి చేస్తోందన్నారు. జగన్ ఈ అభివృద్ధి నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికి 'మావిగన్' అని విషం కక్కుతున్నారని మండిపడ్డారు. మిగిలిన ప్రాంత ప్రజలను రెచ్చగొట్టి పబ్బం గడుపుకునే ప్రయత్నాలు చేస్తున్నారంటూ లంకా దినకర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

# బిఎల్‌వోలు అప్రమత్తంగా విధులు నిర్వహించాలి

## - విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు : జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కార్యక్రమంలో పాల్గొంటున్న బూత్ లెవెల్ ఆఫీసర్లు అందరూ అప్రమత్తంగా విధులు నిర్వహించాలని, ఎవరైనా నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల హెచ్చరించారు. శుక్రవారం నెల్లూరు నగరంలోని పొదలకూరు రోడ్డు వెంగళరావు నగర్ ప్రాంతంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కార్యక్రమాన్ని కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా బూత్ లెవల్ ఆఫీసర్ (బిఎల్‌ఓ) నిర్వహిస్తున్న ఇంటింటి సర్వే ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణ, ఓటర్ల వివరాల ధృవీకరణ, కొత్త ఓటర్ల నమోదు తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని దీూలకు సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని, ఇంటింటి సర్వేలో ఎలాంటి లోపాలు లేకుండా జాగ్రత్తగా పని చేయాలని ఆదేశించారు. ఓటరు జాబితా సమాచారం కోసం ఫోన్ చేసిన ఓటర్లందరకు సమాచారం అందించాలని బి ఎల్ వోలకు సూచించారు. ఓటర్ల నుండి అందుతున్న దరఖాస్తులను సకాలంలో పరిశీలించి, నిర్దేశిత విధానాల ప్రకారం నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో అవగాహన కల్పించి, ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచేందుకు కృషి చేయాలని తెలిపారు. కలెక్టర్ వెంట ఆర్డిఓ అనూష, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# బొమ్మన్, కొమారి పెండ్లి సందడిలో వధూవరులను ఆశీర్వదించిన ప్రముఖ నేతలు









**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు నగరములోని రంగ నాయకులు పేట కిరణ్, శ్రీరామ్ ఏసీ తియేటర్‌లో జరిగిన కొమారి, బొమ్మన్ వివాహ వేడుకల్లో నూతన వధూవరులు అయిన కొమారి చంద్రిక, బొమ్మన్ మోహన్ తేజ్‌లను పలువురు పెద్దలు పలు రంగాల నేతలు, రాజకీయ పార్టీ నేతలు మహిళలు అక్షింతలు వేసి ఆశీర్వదించారు. ముత్తుకూరుకు చెందిన కొమారి పురుషోత్తం, విశాలమ్మ దంపతులకు చెందిన కుమార్తె చంద్రికను నెల్లూరు నగరానికి చెందిన విశ్రాంతి ఉపాధ్యాయుడు బొమ్మన్ మహేంద్ర, రాజేశ్వరిలకు చెందిన తనయుడుమోహన్ తేజ్‌కు వివాహ ము అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఏపీ బెస్త కార్పొరేషన్ చైర్మెన్ బొమ్మన్ శ్రీధర్, ఏపీ బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ బొమ్మన్ పళని, దంపతులు, ప్రముఖ ఎలక్ట్రానిక్స్ డిజైనర్ బొమ్మన్ శ్రీకుమార్, టీడీపీ నేతలు ఈదూరు రామమోహన్ రెడ్డి, ఆనం రంగ మయూర్ రెడ్డి, ప్రముఖ రొయ్యలు కంపెనీ వ్యాపారవేత్తలు కడియాల తెలిపారు. చాకిచర్ల జయరాం, ప్రముఖ ఉపాధ్యాయులు, ప్రముఖ రాజకీయవేత్త కొమారి రామచంద్రయ్య, ప్రముఖ న్యాయవాదులు కడియాల శ్యాము, రాజేష్, రమేష్, మహిళా టీడీపీ నేత కొ మారి విజయమ్మ, టీడీపీ నేత కోమారి వేణుగోపాల్, మత్స్యకార సీనియర్ నేతలు కొమారి మస్తానయ్య, ప్రముఖ పారిశ్రామిక వేత్త కొండూరు బడి పోలయ్య,తీర ప్రాంత మత్స్యకార పలువురు నేతలు, బంధువులు, స్నేహితులు. స్థానిక పలు వ్యాపారవేత్తలు, మహిళలు తదితరులు పాల్గొని నూతన వదువరులను అక్షింతలు వేసి ఆశీర్వదించారు. వివాహ వేడుకలు ఘనంగా జరిగింది.

# ఐటీ రంగంలోనూ నెల్లూరు ముందడుగు

## - నగరానికి సాఫ్ట్‌వేర్ కంపెనీలు రావడం శుభపరిణామం - సీఎం పిలుపు మేరకు ప్రతి ఇంటా ఒక పారిశ్రామికవేత్త ఎదగాలి - నెక్సస్ ఇన్నోవేషన్ హబ్ : కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి






**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరులో మొట్టమొదటి మల్టీ-కంపెనీ ఏఐ ఇన్నోవేషన్ పార్క్ 'నెక్సస్ ఇన్నోవేషన్ హబ్' ప్రారంభోత్సవంలో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ, వ్యవసాయం, ఆక్వాకల్చర్, పారిశ్రామిక రంగాల్లో ఇప్పటికే అభివృద్ధి చెందుతున్న నెల్లూరు జిల్లా ఇప్పుడు ఐటీ రంగంలోనూ ముందంజ వేయడంఆనందదాయకమని అన్నారు. సాఫ్ట్‌వేర్ కంపెనీలను నెల్లూరుకు తీసుకొచ్చి నెక్సస్ ఇన్నోవేషన్ హబ్‌ని ప్రారంభించిన రెనిల్ రెడ్డికి అభినందనలు తెలిపారు. ఈ హబ్ ద్వారా ఏర్పడుతున్న సంస్థలు రానున్న రోజుల్లో జిల్లాలోని యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తూ వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామికవేత్త రావాలనే లక్ష్యంతో యువతను ప్రోత్సహిస్తున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అదే స్ఫూర్తితో యువత ఇలాంటి ఇన్నోవేషన్ హబ్‌లను సద్వినియోగం చేసుకుని తమ వినూత్న ఆలోచనలను స్టార్టప్‌లుగా మలచాలని సూచించారు.

నెల్లూరులో ఐటీ, ఆవిష్కరణలు, స్టార్టప్ లకు అనుకూల వాతావరణం ఏర్పడడం ద్వారా స్థానిక యువతకు సొంత జిల్లాలోనే ఉన్నత స్థాయి అవకాశాలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, వక్ఫ బోర్డు చైర్మన్ అజీజ్ నెక్సస్ ఇన్నోవేషన్ హబ్ వ్యవస్థాపకులు రెనిల్ రెడ్డి కోమిట్లతో పాటు పలువురు ప్రముఖులు, విద్యార్థులు, యువత పాల్గొన్నారు.

# నెల్లూరు గడప ముందుకే సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు : ఎంపీ వేమిరెడ్డి

## - నెక్సస్ ఇన్నోవేషన్ హబ్ ప్రారంభం - స్థానిక యువతకు నెల్లూరులోనే ఐటీ భవిష్యత్తు






**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు వంటి ద్వితీయ శ్రేణి నగరాల్లో (టూ-టైర్ సిటీస్) యువత ఉద్యోగాల కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లకుండా, వారి గడప ముందుకే సాఫ్ట్‌వేర్ అవకాశాలను తీసుకురావడం అభినందనీయమని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అన్నారు. శుక్రవారం నెల్లూరులోని వీపీఆర్ కన్వెన్షన్‌లో ఏర్పాటు చేసిన నగరపు మొట్టమొదటి మల్టీ-కంపెనీ ఏఐ ఇన్నోవేషన్ పార్క్ 'నెక్సస్ ఇన్నోవేషన్ హబ్' ప్రారంభోత్సవంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ, ఇలాంటి ఇన్నోవేషన్ హబ్‌ల ఏర్పాటు చదువుకుంటున్న విద్యార్థులకు, కళాశాల విద్య పూర్తి చేసుకున్న యువతకు ఎంతో మోటివేషన్ ఇస్తుందన్నారు. ప్రస్తుతం ప్రపంచం చాలా వేగంగా మారుతోందని, ఆ వేగాన్ని అందుకోవడం టూ-టైర్ నగరాల్లో కొంచెం సవాలుతో కూడుకున్నదైనప్పటికీ, రెనిల్ రెడ్డి కోమిట్ల లాంటి వ్యక్తులు ముందుకు రావడం నెల్లూరు జిల్లాకు గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా రెనిల్ రెడ్డి నేపథ్యాన్ని ఎంపీ గుర్తు చేసుకున్నారు. ఒకప్పుడు నెల్లూరు ట్రంక్ రోడ్డులో రేణిల్ తాతగారు ఒక చిన్న సైకిల్ షాప్ నిర్వహించేవారని, అలాంటి సాధారణ నేపథ్యం నుంచి వచ్చిన రేణిల్, విదేశాలకు వెళ్లి ప్రపంచ స్థాయి కంపెనీలను స్థాపించారని చెప్పారు. ఆ తర్వాత పుట్టిన ఊరికి ఏదైనా చేయాలని నెల్లూరుకు తిరిగి వచ్చి, 2022లోనే టెర్రాలాజిక్ కంపెనీ ప్రారంభించారని పేర్కొన్నారు. ఆయన ప్రయాణం నేటి యువతకు ఆదర్శమని కొనియాడారు.

ప్రస్తుతం ఈ హబ్ ద్వారా 150 మందికి ఉపాధి లభించిందని, రాబోయే రోజుల్లో ఈ సంఖ్య 5,000 కు పెరిగే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. సుదూర ప్రాంతాలకు వెళ్లి ఉద్యోగాలు చేయడానికి ఇష్టపడని స్థానిక యువతకు ఈ కేంద్రం ఒక సువర్ణావకాశం అన్నారు. విద్యార్థులు తమ సొంత ఆలోచనలను స్టార్టప్‌లుగా మార్చుకోవడానికి ముందుకు రావాలని, నెల్లూరు ఎంపీగా ఈ ఇన్నోవేషన్ హబ్‌లకు, యువతకు ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్నా అందించడానికి తాను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి , రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ అజీజ్ తదితరులు తమ సందేశాన్ని అందజేశారు.

సంస్థ వ్యవస్థాపకులు రెనిల్ రెడ్డి మాట్లాడుతూ సొంత భూమిపై మమకారంతో నెల్లూరులో నెక్సస్ ఇన్నోవేషన్ హబ్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఐటీ నెల్లూరు జిల్లాలో ఇది తొలి మల్టీ నేషన్ పార్క్ అన్నారు. ప్రస్తుతం 120 మంది టెక్నాలజీ నిపుణులు ప్రపంచ మార్కెట్ కోసం ఏఐ ఉత్పత్తులను రూపొందిస్తున్నారన్నారు. భారత దేశంలోని టైర్ 2 నగరాలు టెక్నాలజీకి కేవలం ఆతిథ్యం ఇవ్వడం కాదు టెక్నాలజీని స్వయంగా నిర్మించగలవని చాటి చెప్పడమే తమ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగర మేయర్ బెల్లంకొండ సుజాతతో పాటు పలువురు పాల్గొన్నారు.

# కల్లు గీత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి

## - గౌడ్ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు తిరకాల శీనయ్య గౌడ్







**నెల్లూరు, (రాజధాని వార్తలు):** రాష్ట్రములో జరుగుతున్న గీత కార్మికులకు ప్రమాదాలు పట్ల ప్రభుత్వం చర్యలు తీసుకొని వారి సంక్షేమం అభివృద్ధి కొరకు కృషి చెయ్యాలని గౌడ సంక్షేమ సంఘం నెల్లూరు జిల్లాఅధ్యక్షులు తిరకాల శీనయ్య గౌడ్ అన్నారు. గౌడ్ సంఘము ఆత్మీయ సమావేశం అక్క చెరువు పాడు గ్రామంలో జరిగింది. ఈ సందర్భంగా నూతన కమిటీ జిల్లా పర్యటనలో భాగంగా నెల్లూరు రూరల్ నియోజకవర్గం అక్కచెరువుపాడు గ్రామంలో గౌడ సంక్షేమ సంఘం ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పరిచయ కార్యక్రమంలో నూతన జిల్లా కమిటీని గౌడ కులస్తులు ఘనంగా సన్మానించడం జరిగింది. అనంతరం గౌడ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు తిరకాల. సీనయ్య గౌడ్ మాట్లాడుతూ నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో కులస్తుల జనాభా చాలా ఎక్కువగా ఉందని అలాగే రాజకీయంగా చైతన్యవంతమైందని మండల, జిల్లా, రాష్ట్ర రాజకీయాలపై ప్రభావం చూపే నాయకులు ఇక్కడి నుంచి ఎదగాలని, యువత అన్ని రంగాలలో విజయాలు సాధించాలని, విద్యార్థులు విద్యారంగంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. తాటి, ఈత, కొబ్బరి వృక్షాల కోసం ఫామ్ బోర్డు ఏర్పాటును ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళతామని, గీత వృత్తిదారుల సాధికారత కోసం పనిచేస్తామని, తాటి ఉత్పత్తులకు మార్కెటింగ్ అవకాశాల కోసం కృషి చేస్తామని, తాటి ఆధారిత పరిశ్రమల ఏర్పాటు అభివృద్ధి కోసం పనిచేస్తామని, రాష్టంలో పది లక్షల తాటి చెట్లు నాటడం పర్యావరణాన్ని పరిరక్షించడం చేస్తామన్నారు. అలాగే కల్లుగీత అన్నల నుదుటి గీతలు మారవా అని ప్రశ్నించారు. ఒక దిక్కు వృత్తి ధర్మం, మరో దిక్కు అదే వృత్తిలో మరణ శాసనం ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా ఎన్ని హామీలు ఇచ్చినా గీతన్నల ఆలి మెడలో తాళి ఆగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్టంలో రోజు పదుల సంఖ్యలో ప్రమాదాలు జరుగుతున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అన్నారు. ప్రజా ప్రతినిధుల హామీలు మాటలకే పరిమితం అవుతున్నాయని ఇప్పటికైనా అన్ని రాజకీయ పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు మైకం వీడి గీత కార్మికుల రక్షణ కోసం నడుం బిగించాలని హితవు పలికారు. తాటి చెట్టు పరిరక్షణ గీత కార్మికుల సంక్షేమం కోసం పాటు పడతామని, కులవృత్తి పునరుద్ధరణ ఆధునిక శాస్త్ర సాంకేతికను అందించడం గీతనన్నల ప్రాణాలు కాపాడడం, గీత కార్మికులకు ప్రమాద బీమా అమలు చేయించడం, బాధిత కుటుంబాలను ఆర్థిక భరోసా కల్పించడం, గీతనన్నలను ప్రభుత్వం ఆదుకునేలా పనిచేస్తామని హామీ ఇచ్చారు. అలాగే మహిళలు, యువత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను పొందాలని గౌడ్ గీత కార్మికులు, వృద్దులు, వితంతువులు, వికలాంగులు, పెన్షన్లు తీసుకోవాలని గీత కార్మికులు విధిగా లైసెన్సులు పొందాలని, గుర్తింపు కార్డులు కలిగి ఉండాలని, గ్రామాలలో సొసైటీల ఏర్పాటుకు పాటుపడతామని సొసైటీ భవనాల నిర్మాణం కోసం కృషి చేస్తామని తెలిపారు. అలాగే నిరుద్యోగ యువత పారిశ్రామికంగా వ్యాపార పరంగా నిలదొక్కుకోవాలని మద్యం బెల్ట్ షాపుల నిరోధానికి ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని, గ్రామ గ్రామాన గౌడ్లను సమీకరించి వారిని జాగృతం చేసి సమర్థవంతమైన నాయకులగా తయారు చేస్తామన్నారు. జాతీయ నాయకుల స్ఫూర్తితో పని చేయాలని సర్దార్ సర్వాయి. పాపన్న గౌడ్, గౌతు. లచ్చన్న గౌడ్ వారసత్వాన్ని అందుపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. తాను గౌడ కులంలో పుట్టినందుకు చాలా అదృష్టంగా భావిస్తున్నానని నూతన గౌడ సంఘం కమిటీ ఆధ్వర్యంలో నెల్లూరు జిల్లాలో నాయకులను తయారు చేసే కర్మాగారంగా తయారవ్వాలి అన్నారు. అట్లాగే గౌడ్లు అన్ని రంగాలలో ఎదుగుదలకు తమవంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా అందిస్తామని చెప్పారు. పై కార్యక్రమంలో నాయకులు అన్నం. దయాకర్ గౌడ్, ఉదయగిరి. నరసింహులు గౌడ్, దద్దోలు, చక్రపాణి గౌడ్, ఎంపులూరు భాస్కర్ గౌడ్, యేపూరి రమేష్ గౌడ్, ముక్కు రాధాకృష్ణ గౌడ్, మారుబోయిన శ్రీనివాసులు గౌడ్, తుళ్లూరు మల్లికార్జున గౌడ్ దాసరి రాజేంద్ర గౌడ్, జడపల్లి రత్నం గౌడ్ దద్దోలు పవన్ తేజ గౌడ్, నాశనగోపాలయ్య గౌడ్ నాసిన చిన్న చెన్నయ్య గౌడ్ నాసిన అనంతయ్య గౌడ్ నడవల పోలయ్య గౌడ్ మరియు గౌడ్ కులస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# సంపాదకీయం

## ఆంధ్రప్రదేశ్ రాజధానిపై వైసీపీ ఊగిసలాట - రాజకీయ పిల్లిమొగ్గలు, ప్రజల ప్రయోజనాలు!

ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ జరిగి పుష్కర కాలం కావస్తున్నా, రాజధాని పై విషం చిమ్మడం ఒక చారిత్రక విషాదం. గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీసుకున్న 'మూడు రాజధానుల' నిర్ణయం, ఆ తర్వాత జరిగిన రాజకీయ, న్యాయ పరమైన పరిణామాలు రాష్ట్ర అభివృద్ధిని తీవ్రమైన గందరగోళంలోకి నెట్టేసాయి. ఏపీ రాజధాని వ్యవహారం ఒక గమ్యం లేని ప్రయాణంలా, రాజకీయ పిల్లిమొగ్గలతో సాగుతున్న నాటకంలా వైఎస్సీపీ మార్చాలని విశ్వ ప్రయత్నం చేస్తోంది. గతంలో రాజధాని మార్పు, వికేంద్రీకరణ పేరుతో జరిగిన ఈ ఊగిసలాట రాష్ట్ర భవిష్యత్తును ఎలా ప్రభావితం చేసిందో విశ్లేషించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**అమరావతి నుండి మూడు రాజధానుల దాకా: గందరగోళ ప్రస్థానం**

గతంలో వేలాది మంది రైతులు స్వచ్ఛందంగా భూములు ఇచ్చి, ఏకైక రాజధానిగా రూపుదిద్దుకుంటున్న అమరావతి ప్రయాణానికి జగన్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే బ్రేకులు పడ్డాయి. 'వికేంద్రీకరణ' అనే ఆకర్షణీయమైన నినాదంతో అమరావతి (శాసన రాజధాని), విశాఖపట్నం (కార్యనిర్వాహక రాజధాని), కర్నూలు (న్యాయ రాజధాని) అంటూ మూడు రాజధానుల ప్రతిపాదనను తెరపైకి తెచ్చారు.

**పాలకుల మాటల పిల్లిమొగ్గలు:**

"నేను ఎప్పుడూ ఒకే మాట మీద ఉంటా, కానీ నా మాటలే పల్టీలు కొడుతున్నాయి" అనే తరహాలో ఆ ప్రభుత్వ నిర్ణయాలు మారాయి. ఒకసారి అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టడం, న్యాయ పరమైన చిక్కులు రాగానే దాన్ని వెనక్కి తీసుకోవడం, మళ్లీ కొత్త బిల్లు తెస్తామనడం–ఇలాంటి అస్థిర వైఖరితో ఐదేళ్ల కాలం వృథా అయిపోయింది. ఇంకా ఇలానే చేయాలని తాపత్రయం పడుతున్నారు.

కనుమరుగైన పెట్టుబడులు: ఒక రాష్ట్రానికి రాజధాని ఎక్కడో స్పష్టత లేనప్పుడు, అంతర్జాతీయ లేదా జాతీయ స్థాయి పెట్టుబడిదారులు ఆ రాష్ట్రం వైపు చూడటానికి సాహసించరు. గతంలో ఈ అస్థిరత కారణంగా ఆంధ్రప్రదేశ్‌కు రావలసిన అనేక భారీ పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు వేరే రాష్ట్రాలకు తరలిపోయాయి.

**ప్రజల జేబు ఖాళీ - భవిష్యత్తు ప్రశ్నార్థకం**

ఈ రాజకీయ వ్యూహాల వల్ల తీవ్రంగా నష్టపోయింది సామాన్య ప్రజలు, యువత మాత్రమే. క్యాపిటల్ (ధనం) పోయింది, క్యాపిటల్ (రాజధాని) రాలేదు. రాజధాని మారుతుందనే ప్రచారంతో భూముల విలువలు పడిపోవడం, నిర్మాణ రంగం కుంటుపడటం వల్ల ప్రజల జేబులు ఖాళీ అయ్యాయి (ధనం నష్టపోయారు). కానీ, ఐదేళ్లు గడిచినా ఒక పూర్తిస్థాయి రాజధాని (క్యాపిటల్) మాత్రం సాకారం కాలేదు.

2. యువత ఆవేదన: అభివృద్ధిని పక్కనబెట్టి, రోజుకో కొత్త డ్రామాతో కాలయాపన చేయడం వల్ల తమ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని రాష్ట్ర యువత ఆందోళన చెందింది.

**ఇప్పటికైనా కావాల్సింది ఒకే మాట.. ఒకే బాట**


రాజకీయ ప్రయోజనాల కోసం ప్రతి కొత్త ప్రభుత్వం వచ్చినప్పుడల్లా రాజధానిని, ప్రభుత్వ విధానాలను మార్చుకుంటూ పోతే రాష్ట్రం శాశ్వతంగా వెనుకబడిపోతుంది. పరిపాలనా వికేంద్రీకరణ అంటే రాజధానులను ముక్కలు చేయడం కాదు, అన్ని ప్రాంతాలకు నిధులు కేటాయించి సమానంగా అభివృద్ధి చేయడం. ఆంధ్రప్రదేశ్ ప్రజలు పాలకుల నుండి 'పల్టీల షో'లను ఆశించడం లేదు, వాస్తవికమైన అభివృద్ధిని కోరుకుంటున్నారు. రాజకీయ ఊగిసలాటలకు స్వస్తి చెప్పి, రాష్ట్రానికి ఒక నిర్దిష్టమైన దిశను, భరోసాను ఇవ్వాల్సిన బాధ్యత, భవిష్యత్తు, సమయానికి చెప్పిన పని చేయటం పాలకులపై ఉంది. అమరావతికి చట్టబద్ధత రావటంతో రాజధాని అమరావతిగా క్లారిటీ వచ్చింది. వైసీపీ ఇప్పటికైనా తన పంథాను మార్చుకుని ప్రస్తుత ప్రభుత్వంపై నిర్మాణాత్మక విమర్శలు మాత్రమే చేయాలి. అప్పుడే ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణం సాధ్యమవుతుంది.

## రోటరీ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం - 11 మంది సభ్యుల చేరిక




**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** శ్రీకాళహస్తి రోటరీ క్లబ్ 2026–27 సంవత్సర నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. బెంగళూరు డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎలెక్ట్ హారిణి ముఖ్య అతిథిగా హాజరై నూతన కమిటీ సభ్యులకు రోటరీ పిన్‌లు అలంకరించారు. నూతన అధ్యక్షురాలిగా పి. ప్రమీల, కార్యదర్శిగా డా.ఆర్.మ్యాగిక్లారా బాధ్యతలు స్వీకరించారు. వీరితో పాటు డైరెక్టర్లు కూడా ప్రమాణం చేశారు. ఈ సందర్భంగా 11 మంది నూతన సభ్యులు రోటరీలో చేరారు. ఈ సందర్భంగా కార్య దర్శి డాక్టర్ మ్యాగిక్లారా మాట్లాడుతూ రోటరీ ద్వారా పాఠశాలల అభివృద్ధి, మహిళా సాధికారత కార్యక్రమాలు, ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఏర్పేడులోని డేవిడ్ రీస్ కుష్టు వ్యాధి ఆసుపత్రికి దాతల సహకారంతో విటమిన్ మాత్రలు, సబ్బులు, పుస్తకాలు ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ సభ్యులు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు.

# సామాన్య కార్యకర్తకు పట్టం కడుతున్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** భారతదేశ రాజకీయ చరిత్రలో మొట్టమొదటిసారిగా సామాన్య కార్యకర్తకు పట్టం కడుతున్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్. జనసేన పార్టీలో కష్టపడి పని చేసే ప్రతి పేద మధ్యతరగతి సామాన్య కార్యకర్తలు అందరికీ సమాన హోదాలో అవకాశం కల్పించాలని తలపెట్టిన జనసేన సమాచార సేకరణ విజయవంతమైంది. ప్రతి ఒక్క సామాన్య కార్యకర్త ఈరోజు పవన్ కళ్యాణ్ తనకు న్యాయం చేస్తారని ఆశతో ఎదురుచూస్తున్నారు. దేశంలోనే కాకుండా రాష్ట్రంలో కూడా మొట్టమొదటిసారిగా ప్రతి కార్యకర్తకు న్యాయం చేయడం కోసం ఈ విధంగా సమాచారం సేకరణ చేసిన ఘనత ఒక్క పవన్ కళ్యాణ్‌కి దక్కుతుంది. చరిత్ర సృష్టించిన పవన్ కళ్యాణ్ వందలాదిగా వేలాదిగా కార్యకర్తలు సమాచారాన్ని ఇస్తున్నారని మరో రెండు రోజులు పొడిగించడం హర్షించదగ్గ విషయమని జనసేన విశాఖ జిల్లా నాయకులు రాజు గౌడ్ యాత ఆనందం వెలిబుచ్చారు. జనసేన పార్టీలో విశాఖ జిల్లా అధికార ప్రతినిధిగా అవకాశం కల్పించమని అనకాపల్లి ఎమ్మెల్యే విశాఖ జిల్లా పరిశీలకులు కొణతాల రామకృష్ణకి అప్లికేషన్ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో యాత నాయకులు జనసేన నాయకులు ఖండిపల్లి శ్రీధర్ శరన్ సాయి, సాగర్, సంపత్ తదితరులు పాల్గొన్నారు. జనసేన పార్టీలో విశాఖ జిల్లా అధికార ప్రతినిధిగా అవకాశం కల్పించమని అనకాపల్లి ఎమ్మెల్యే విశాఖ జిల్లా పరిశీలకులు కొణతాల రామకృష్ణకి అప్లికేషన్ ఇవ్వడం జరిగింది.

# సర్ కార్యక్రమంలో నివాసిత సంక్షేమ సంఘాలు భాగస్వామ్యం కావాలి

**- ఓటరు నమోదు ప్రక్రియలో ప్రజలకు అవగాహన కల్పించి పూర్తి సహకారం అందించండి - ప్రతి ఎన్నికల సూపర్వైజర్‌కు ఒక నివాసిత సంక్షేమ సంఘాన్ని అనుసంధానం చేశాం : జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్**




**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** భారత ఎన్నికల సంఘం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని నిర్ణీత గడువులో విజయవంతంగా పూర్తి చేయ డానికి నగరంలోని నివాసిత సంక్షేమ సంఘాలు చురుకైన పాత్ర పోషించాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఒక ప్రకటనలో కోరారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ఓటరు జాబితా సవరణ ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యంత కీలకమైన ప్రక్రియ అని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావడం, వివరాలలో మార్పులు, చేర్పులు, తొలగింపులు వంటి అంశాలను సకాలంలో పూర్తి చేసుకునేలా ప్రజలకు విస్తృత అవగాహన కల్పించేందుకు సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమం సమర్థవంతంగా అమలు కావడానికి ప్రతి ఎన్నికల సూపర్వైజర్‌కు ఒక నివాసిత సంక్షేమ సంఘాన్ని అనుసంధానం చేయడం జరిగిందని తెలిపారు. ఈ సంఘాల ప్రతినిధులు ఎన్నికల సూప ర్వైజర్లు, బూత్ లెవల్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ తమ కాలనీలలో ప్రజలకు సమాచారం అందించడం, అవసర మైన సహకారం అందించడం ద్వారా కార్యక్రమాన్ని విజయ వంతం చేసేందుకు సహకరించాలని కోరారు. నగరంలోని అన్ని నివాసిత సంక్షేమ సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు, సభ్యులు ఈ కార్యక్రమాన్ని ప్రజా భాగస్వామ్యంతో విజయవంతం చేయా లని, అర్హులైన ప్రతి పౌరుడు ఓటరు జాబితాలో తన పేరు నమోదు అయ్యేలా చొరవ తీసుకోవాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు. ప్రజల సహకారంతో ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్ర మాన్ని విజయవంతంగా పూర్తి చేసి, స్వచ్ఛమైన, పారదర్శకమైన ఓటరు జాబితా రూపకల్పనకు అందరూ తోడ్పడాలని ఆయన పిలుపునిచ్చారు.

# పోర్టు కాలుష్యానికి వ్యతిరేకంగా విశాఖలో వైసీపీ నేతల నిరసన

**- జగదాంబ జంక్షన్ వద్ద మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ ఆద్వర్యంలో నిరసన - నిరసన కార్యక్రమంలో భారీగా పాల్గొన్న 41వ మాజీ కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ, వార్డు అధ్యక్షులు కోడిగుడ్ల శ్రీధర్ - పోర్టు పొల్యూషన్‌పై తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్**







**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** విశాఖ పోస్టాఫీస్, పాతపట్నం పరిసర ప్రాంతాలను వేధిస్తున్న పోర్టు కాలుష్యానికి వ్యతిరేకంగా వైసీపీ పోరు బాట పట్టింది. దక్షిణ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ ఆద్వర్యంలో జగదాంబ జంక్షన్ వద్ద మోకాళ్లపై నడుస్తూ నిరసన కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి 41వ వార్డు మాజీ కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ, వార్డు అద్యక్షులు కోడిగుడ్ల శ్రీధర్, భారీగా పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. ప్రభుత్వ తీరును ఎండగడుతూ పూర్ణ మార్కెట్ వరకు ర్యాలీ చేపట్టారు. కాలుష్యాన్ని నివారించేలా తగిన చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలమయ్యారంటూ 41వ వార్డు మాజీ కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ ఆగ్రహం వ్యక్తం చేశారు. పోర్టు పొల్యూషన్ తమ జ్ఞానాపురం ప్రాంతాన్ని కూడా వేదిస్తోందని, దీన్ని అరికట్టేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని, కాలుష్యం కారణంగా రోగాల బారిన పడి మరణాలు కూడా సంభవిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో పొల్యూషన్‌ను అరికట్టేలా చర్యలు చేపట్టడం జరిగిందని, అయితే కూటమి ప్రభుత్వ హయాంలో గత రెండేళ్లుగా పొల్యూషన్‌పై దృష్టి సారించలేదని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పొల్యూషన్‌ను అరికట్టే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# గోదావరి ఏటిగట్ల పటిష్టతకు సిఎస్ఐఆర్–ఎన్ఐఓ ద్వారా సమగ్ర ప్రతిపాదనలు

**- జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్**



**అమలాపురం, (రాజధాని వార్తలు):** బలహీన పడిన గోదావరి నది ఏటిగట్లను శాశ్వత ప్రాతిపదికన పటిష్ట పరచడానికి సిఎస్ఐఆర్ – నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీ ప్రతినిధులతో కలిసి సమగ్ర ప్రతిపాదనలు రూపొందిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ వెల్లడించారు. కలెక్టరేట్ నుండి సిఎస్ఐ ఆర్–ఎన్ఐఓ ప్రతినిధులు శుక్రవారం డాక్టర్ వినీత్, సైంటిస్టులు జయ కుమార్, సేలంలతో కలెక్టర్ ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఇటీవల కుండలేశ్వరం వద్ద గోదావరి తీరం వెంబడి ఏటిగట్టు కిందకు కుంగి పోయినఘటనను తీవ్రంగా పరిగణించామన్నారు. ఇటువంటి బలహీనమైన, ప్రమాదకరమైన ప్రాంతాలను రక్షించడానికి శాస్త్రీయ విధానాలు అవసరమని అన్నారు. ఈ నేపథ్యంలో నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీ నిపుణులు, గోదావరి హెడ్ వర్క్స్ జల వనరుల శాఖ ఇంజనీర్లు కలిసి క్షేత్రస్థాయిలో సంయుక్తంగా పర్యటించాలని ఆదేశించారు. గోదావరి తీరప్రాంత పొడవునా ఎక్కడెక్కడ ఏటిగట్లు బలహీన పడ్డాయో క్షుణ్ణంగా పరిశీలించి వాటిని గుర్తించి, పునరుద్ధరణకు ప్రాథమిక నివేదిక, ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. ఈ ప్రతిపాదనల ఆధారంగా డాక్టర్ ఎం.ఎస్. శ్రీవత్స, సంస్థ సీఈఓ కిరణ్ పమిడిపాటి సాంకేతిక అంచనాలను త్వరిత గతిన రూపొందించాలని జిల్లా కలెక్టర్ కోరారు. భవిష్యత్తులో నదీ తీర ప్రాంతాల్లో సంభవించే విపత్తుల తీవ్రతను తగ్గించేందుకు, ఈ ప్రాజెక్టుకు అవసరమైన నిధులను జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ నుండి రాబట్టేందుకు చర్యలు తీసుకుంటు న్నట్లు కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జలవనరుల శాఖ పర్యవేక్షకు ఇంజనీర్ జి శ్రీనివాసరావు, సహచర ఇంజనీర్లు జిల్లా జిల్లా డ్రైనేజీ విభాగం కార్యనిర్వాహక ఇంజనీర్ ఎం వి వి కిషోర్ శాస్త్రవేత్తలు, తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# సేవలే పరమావధిగా "మెకానిక్ డే" వేడుకలు




**సామర్లకోట, (రాజధాని వార్తలు):** టూ వీలర్ సృష్టికర్త "గాట్లిబ్ డైమ్లార్" జయంతి పురస్కరించుకుని సామర్లకోట పట్టణంలో శ్రీ లక్ష్మీ గణపతి స్కూటర్ మరియు మోటర్ సైకిల్ యూనియన్ అసో సియేషన్ ఆధ్వర్యంలో "మెకానిక్ డే" వేడుకలను సేవలే పరమావదిగా చేసుకుని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శలు తూరపాటి లక్ష్మణరావు, జామి శ్రీనువాస్ ఆధ్వర్యంలో పెద్దాపురం మండలం శాంతి వర్ధన్ విభిన్న ప్రతిభావంతుల పాఠశాలలో విద్యార్థుల సమక్షంలో మెకానిక్ సోదరులు కేక్ కటింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మెకానిక్ యూనియన్ అధ్యక్షులు తూరపాటి లక్ష్మణరావు మాట్లాడుతూ మెకానిక్ సోదరులు సంఘటితంగా కలిసి ఉండాలని, తద్వారా తమ సమస్యలు పరిష్కారానికి దోహద పడుతుదన్నారు. అంతకుముందు సామర్లకోటలో ట్రాఫిక్ ఎస్ఐ అడపా గరగారావు, సీనియర్ మెకానిక్‌లు నీలం మూర్తి, సేవా సత్యనారాయణలను మెకానిక్ యూనియన్ నాయకులు దుస్సాలువా, పూలదండలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉప్పరపల్లి సాంబ శివ, సారంపాటి రాజు, చిట్టి, కర్రి బుజ్జి, సిహెచ్ నాగేంద్ర, మహేష్, సాయి, వీరు, అంజి, వి శివ, ఎ.రాజు తదితరులు పాల్గొన్నారు.

# కార్పొరేట్ స్థాయి విద్య అందించాలి



**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** పేద విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్యను అందించాలని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప కోరారు. శుక్రవారం పెద్దాపురంలో మహాత్మ జ్యోతి రావు పూలే బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం అందించిన ట్రాక్ షూట్లు, షూస్, ఇతర విద్యా పరికరాలను ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో విద్యారంగానికి అధిక ప్రాధాన్యత కల్పించడం జరిగిందన్నారు. మంత్రి లోకేష్ లక్ష్యసాధనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు నిమ్మకాయల రంగనాగ్ కోరారు. ప్రిన్సిపాల్ చల్లా లోవరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నేతలు రంది సత్యనారాయణ, సరోజ వాసు, అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# బ్యూటీ కొలతలపై ఆందోళన వ్యక్తం చేసిన కాజల్!



గ్లామర్ ప్రపంచంలో నటీమణులపై ఉండే శారీరక ఒత్తిళ్లు, రూపాన్ని బట్టి చేసే విమర్శలు ఈనాటివి కావు. వెండితెరపై కనిపించే కథానాయికలు నిర్దేశిత కొల తలతో, అందంగా కనిపించాలనే నిబంధన చిత్ర పరిశ్రమలో ఎప్పటి నుంచో కొనసాగుతోంది. అయితే మారుతున్న కాలంతో పాటు ఈ అంచనాలు మరింత కఠినంగా మారుతున్నాయని నటి కాజల్ అగర్వాల్ వ్యక్తం చేసిన అభిప్రాయాలు సామాజికంగా సరికొత్త చర్చకు దారితీస్తున్నాయి. సినిమా రంగంలో రెండు దశాబ్దాల అనుభవం ఉన్న కాజల్ అగర్వాల్ తన కెరీర్ ప్రారంభ రోజులను గుర్తు చేసుకున్నారు. తాను పరిశ్రమకి కొత్తలో కూడా నటీమణుల శరీర ఆకృతిపై దర్శకులు, నిర్మాతల నుంచి ఒత్తిళ్లు ఉండేవని పేర్కొన్నారు. కొన్ని సినిమాల కోసం తనను లావుగా అవ్వాలని, మరికొన్ని పాత్రల కోసం సన్నబడాలని చిత్ర నిర్మాతలు కోరిన సందర్భాలను గుర్తు చేసుకున్నారు. కేవలం శారీరక రూపాన్ని బట్టి అంచనా వేసే ధోరణి అప్పట్లోనూ ఉండేదని వివరించారు. అయితే గతంతో పోలిస్తే ప్రస్తుత తరం ఎదుర్కొంటున్న పరిస్థితులు మరీ దారుణంగా ఉన్నాయని కాజల్ ఆందోళన వ్యక్తం చేశారు. తాము కెరీర్ ప్రారంభించిన రోజుల్లో సామాజిక మాధ్యమాల ప్రభావం లేదని దీనివల్ల బాహ్య ప్రపంచం నుండి వచ్చే విమర్శల ఒత్తిడి చాలా తక్కువగా ఉండేదని అభిప్రాయపడ్డారు. కేవలం షూటింగ్స్.. పాత్రల పరిధులకే ఆ అంచనాలు పరిమితమయ్యేవని వ్యక్తిగత జీవితంలో స్వేచ్ఛగా ఉండే అవకాశం ఉండేదని వెల్లడించారు. నేటి డిజిటల్ యుగంలో నటీమణుల పరిస్థితి పూర్తిగా మారిపోయిందన్నారు. ప్రస్తుతం సౌందర్య ప్రమాణాలు క్రూరంగా దయాదాక్షిణ్యాలు లేనివిగా తయారయ్యాయని అన్నారు. కేవలం వెండితెరపైనే కాకుండా విమానాశ్రయాల్లో కనిపించే సాధారణ లుక్స్ నుండి ప్రతి చిన్న బహిరంగ ప్రదర్శన వరకు నెటిజన్లు తీక్షణంగా గమనించి విమర్శలు గుప్పిస్తున్నారన్నారు. నిరంతరం మేకప్‌తో, ఖరీదైన దుస్తులతో పరిపూర్ణంగా కనిపించాలనే ఆధునిక ఒత్తిడిని చూస్తుంటే యువ నటీమణుల పట్ల జాలేస్తుందని కాజల్ వ్యాఖ్యానించారు. ఇలాంటి కఠినమైన వాతావరణంలో యువ నటీమణులు ఆత్మవిశ్వాసాన్ని కోల్పోకుండా సొంత వ్యక్తిత్వాన్ని కాపాడుకోవాలని ఆకాంక్షించారు. పరిశ్రమలో మనుగడ సాగించాలంటే నటనతో పాటు మానసిక దృఢత్వం కూడా ఎంతో అవసరమని పేర్కొన్నారు. బాహ్య విమర్శలను పక్కన పెట్టి తమ పరిధులను తామే నిర్ణయించుకుని పరి శ్రమలో ప్రత్యేక స్థానాన్ని నిలబెట్టుకోవాలని నేటి తరం నాయికలకు సూచించారు. గ్లామర్ ప్రపంచంలో ఎన్ని సవాళ్లు ఎదురైనప్పటికీ నటిగా తన ఉనికిని చాటుకోవడంలో మానసిక స్థైర్యమే ప్రధాన పాత్ర పోషిస్తుందని కాజల్ మాటలను బట్టి అర్థమవుతుంది. బాహ్య సౌందర్యానికే ప్రాధాన్యతనిచ్చే ఇలాంటి ధోరణి కేవలం చిత్ర పరిశ్రమకే పరిమితం కాలేదు. సోషల్ మీడియా వాడకం పెరిగిన నేటి సమాజంలో సాధారణ మహిళలపై కూడా తీవ్ర ప్రభావం చూపుతోంది. శారీరక రంగు, రూపురేఖలను బట్టి వ్యక్తిత్వాన్ని అంచనా వేయడం ఎంత వరకు సమంజసమనే ప్రశ్న తలెత్తుతోంది.

# శ్రీనివాసకి మహేష్ బాబు సపోర్ట్ దక్కేనా?



సూపర్ స్టార్ కృష్ణ ఫ్యామిలీ నుంచి మరో హీరో తెలుగు సిల్వర్ స్క్రీన్‌పై తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు రెడీ అయ్యాడు. సూపర్ స్టార్ కృష్ణ పెద్ద కుమారుడు రమేష్ బాబు తనయుడు జయకృష్ణ ఘట్టమనేని హీరోగా తెలుగు తెరకి పరిచయం కాబోతున్నాడు. అజయ్ భూపతి దర్శకత్వంలో అశ్విని దత్ నిర్మాణంలో జయకృష్ణ హీరోగా రాబోతున్నాడు. 'శ్రీనివాస మంగాపురం'తో జయకృష్ణను అజయ్ భూపతి ఇండస్ట్రీకి పరిచయం చేయబోతున్న విషయం అందరికీ తెలిసిందే. కొన్ని కారణాల వల్ల వాయిదాలు పడుతూ వచ్చిన 'శ్రీనివాస మంగాపురం' సినిమా ఎట్టకేలకు ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సినిమాను జులై 30న విడుదల చేయబోతున్నట్లుగా అధికారికంగా ప్రకటన చేశారు. క్యూట్ లవ్ స్టోరీతో పాటు, యాక్షన్ ఎలిమెంట్స్, కమర్షియల్ ఎలిమెంట్స్ పుష్కలంగా ఈ సినిమాలో ఉంటాయని మేకర్స్ చెబుతున్నారు.

**మహేష్ బాబు సోదరుడి కొడుకు మూవీ...**

మహేష్ బాబు సోదరుడి కొడుకు అయిన జయకృష్ణ ఇండస్ట్రీలో అడుగు పెడుతున్నాడు అనగానే కృష్ణ అభిమానులు రమేష్ బాబును గుర్తు చేసుకున్నారు. రమేష్ బాబు ఇండస్ట్రీలో ఆశించిన స్థాయిలో నిలదొక్కుకోవడంలో విఫలం అయ్యాడు. కానీ ఆయన కొడుకు జయకృష్ణ కచ్చితంగా స్టార్ హీరోగా నిలుస్తాడని అభిమానులు నమ్మకంగా ఉన్నారు. కృష్ణ ఫ్యామిలీ నుంచి ఏ హీరో ఎంట్రీ ఇచ్చినా కచ్చితంగా మహేష్ బాబు మద్దతు ఉంటుంది. గతంలో కృష్ణ ఉన్న సమయంలో కచ్చితంగా తన ఫ్యామిలీ హీరోలకు మద్దతుగా నిలిచేవాడు. కానీ ఆయన చనిపోయిన తర్వాత ఆ బాధ్యత పూర్తిగా మహేష్ బాబుపై పడింది. సుధీర్ బాబు లేదా మరే హీరో మూవీ వచ్చినా కూడా మహేష్ బాబు ముందు ఉండి ఫ్యాన్స్ కు పరిచయం చేయాల్సిన పరిస్థితి ఉంది. ఇప్పుడు జయకృష్ణను సైతం అభిమానులకు మహేష్ బాబు పరిచయం చేయాలని అంతా కోరుకుంటున్నారు.

**జయకృష్ణ హీరోగా తెలుగు ఇండస్ట్రీకి పరిచయం...**


జయకృష్ణ హీరోగా ఎంట్రీ ఇవ్వబోతున్న 'శ్రీనివాస మంగాపురం' సినిమాకు మహేష్ బాబు ఖచ్చితంగా వంద శాతం సహకారం అందించి, తన వంతు ప్రమోషన్ కార్యక్రమాల్లో పాల్గొనేవాడు. కానీ ప్రస్తుతం మహేష్ బాబు వారణాసి సినిమా షూటింగ్‌లో ఉన్నాడు. ఆ సినిమా టాలీవుడ్ జక్కన్న రాజమౌళి దర్శకత్వంలో రూపొందుతుంది అనే విషయం ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. రాజమౌళి దర్శకత్వంలో ఏ హీరో సినిమా చేసినా కూడా ఆ హీరో మీడియా ముందు ఎక్కువగా కనిపించకూడదు. అంతే కాకుండా పబ్లిక్ ఈవెంట్స్‌లో ఎక్కువగా మాట్లాడకూడదు, అసలు పబ్లిక్ ఈవెంట్స్‌కి ఎక్కువగా హాజరు కాకూడదు అని కండీషన్స్ ఉంటాయి. కనుక మహేష్ బాబును శ్రీనివాస మంగాపురం కోసం రాజమౌళి పంపిస్తాడా లేదా అనే అనుమానాలను ఫ్యాన్స్‌తో పాటు ఇండస్ట్రీ వర్గాల వారు, మీడియా వారు వ్యక్తం చేస్తున్నారు.

**రాషా తడానీ హీరోయిన్‌గా 'శ్రీనివాస మంగాపురం'**

ఒకటి రెండు ఈవెంట్స్‌కి మహేష్ బాబు హాజరు అయ్యి జయకృష్ణను పరిచయం చేసి, సినిమా గురించి రెండు ముక్కలు మాట్లాడితే జరగాల్సిన పని అంతా అదే జరిగిపోతుందని విశ్లేషకులు అంటున్నారు. తండ్రిలేని బిడ్డ కనుక జయకృష్ణకు మహేష్ బాబు సహకారం చాలా అవసరం. తండ్రి స్థానంలో మహేష్ బాబు నిల్చుని జయకృష్ణను తెలుగు ప్రేక్షకులకు పరిచయం చేయాలని, అందుకోసం అయినా మహేష్ బాబుకు రాజమౌళి సమయం ఇవ్వాలని, అనుమతించాలని అభిమానులు కోరుకుంటున్నారు. రాజమౌళి నుంచి గ్రీన్ సిగ్నల్ వస్తేనే జయకృష్ణకు మహేష్ బాబు సపోర్ట్ దక్కుతుందని అంటున్నారు. ఇక ఈ సినిమాలో జయకృష్ణకు జోడీగా బాలీవుడ్ సీనియర్ హీరోయిన్ రవీనా టాండన్ కుమార్తె రాషా తడానీ హీరోయిన్‌గా నటించింది.


టాలీవుడ్‌లో రాషా ఎంట్రీతోనే మంచి క్రేజ్ దక్కించుకోవడం ఖాయం అని, టాలీవుడ్‌తో పాటు అన్ని భాషల ఇండస్ట్రీల్లోనూ రాషా భవిష్య త్తులో స్టార్‌గా వరుస సినిమాలు చేయబోతుందని ఆమె సన్నిహితులు నమ్మకంగా ఉన్నారు. ఈ సినిమాకు జీ వీ ప్రకాష్ కుమార్ సంగీతాన్ని అందించాడు. తిరుపతి నేపథ్యం లో సాగే ఈ సినిమాలో మంచి ప్రేమ కథతో పాటు, యాక్షన్ ఎలిమెంట్స్ ఉంటాయని మేకర్స్ బల్లగుద్ది మరీ చెబుతున్నారు.

# విజువల్ వండర్ 'నాగబంధం'.. బుక్ మై షో ట్రెండ్స్ తెలిస్తే షాకే..



చిన్న సినిమాగా మొదలై.. ప్రమోషనల్ కంటెంట్ విజువల్‌తో ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించిన మూవీ నాగబంధం. విరాట్ కర్ణ, నభా నటేష్ జంటగా నటించిన ఆ మైథలాజికల్ మూవీకి ప్రముఖ నిర్మాత అభిషేక్ నామా దర్శకత్వం వహించారు. టీజర్, ట్రైలర్‌తో విజువల్ వండర్‌గా ప్రమోట్ చేసిన సినిమా జూలై 3న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. విడుదల తర్వాత రివ్యూలు అటూ ఇటుగా ఉన్నప్పటికీ.. ఆన్ లైన్‌లో టికెట్ల సేల్స్ మాత్రం ఆసక్తికరంగా కనిపిస్తున్నాయి. కేరళలోని అనంత పద్మనాభ స్వామి ఆలయంలోని నిధి, నాగబంధం, బ్రహ్మకమలం వంటి అంశాల నేపథ్యంలో ఈ సినిమాను తెరకెక్కించారు. మైథలాజికల్ ఎలిమెంట్స్‌కు విజువల్ ఎఫెక్ట్స్ యాడ్ చేసి ప్రేక్షకులకు కొత్త ఎక్స్పీరియన్స్ అందించే ప్రయత్నం చేశారు. విడుదలకు ముందు వచ్చిన టీజర్, ట్రైలర్‌లో విజువల్స్‌కు మంచి స్పందన వచ్చింది. ఇప్పుడు థియేటర్లలోనూ అదే అంశం సినిమాకు ప్రధాన బలంగా మారినట్లు కనిపిస్తోంది. ముఖ్యంగా భారీ సెట్స్, విజువల్ ఎఫెక్ట్స్, టెక్నికల్ క్వాలిటీ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. దర్శకుడిగా అభిషేక్ నామా చేసిన ప్రయత్నానికి కూడా ప్రశంసలు దక్కుతున్నాయి. కొన్ని సన్నివేశాలను తెరపై అద్భుతంగా చూపించారని ప్రేక్షకులు అభిప్రాయపడుతున్నారు. కథ విషయంలో భిన్నమైన స్పందనలు వినిపిస్తున్నప్పటికీ..విజువల్ ఎక్స్పీరియన్స్ కోరుకునే వారికి మాత్రం నాగబంధం మంచి ఆప్షన్‌గా మారినట్లు తెలుస్తోంది. ఇక్కడ ఆసక్తికరమైన విషయం ఏంటంటే.. రివ్యూలతో సంబంధం లేకుండా ఆన్లైన్‌లో సినిమాకు టికెట్లు బాగా అమ్ముడవుతున్నాయి. ముఖ్యంగా బుక్ మై షోలో నాగబంధం ట్రెండ్ ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. 68 వేల టికెట్ల సేల్స్‌తో సినిమా సందడి చేస్తోంది.. విడుదలకు ముందు ట్రైలర్ సృష్టించిన ఆసక్తి.. ఇప్పుడు టికెట్ల విక్రయాల్లో కనిపిస్తోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. సాధారణంగా మైథలాజికల్, డివోషనల్ బ్యాక్ డ్రాప్‌తో తెరకెక్కే సినిమాలకు ఫ్యామిలీ ఆడియన్స్ నుంచి మంచి ఆదరణ ఉంటుంది. నాగబంధం విషయంలోనూ అదే జరుగుతున్నట్లు కనిపిస్తోంది. విజువల్ ఎఫెక్ట్స్‌తో కూడిన డివోషనల్ డ్రామా కావడంతో.. సినిమా ఎలా ఉందో ఒకసారి చూద్దామనే ఆసక్తితో ప్రేక్షకులు థియేటర్లకు వెళ్తున్నట్లు తెలుస్తోంది. ఇదే ట్రెండ్ కొనసాగితే శని, ఆదివారాల్లో మంచి వసూళ్లు వచ్చే ఛాన్స్ ఉంది. అయితే సినిమాపై కొన్ని కంప్లయింట్స్ కూడా వినిపిస్తున్నాయి. ముఖ్యంగా కథ విషయంలో మరింత కొత్తదనం ఉండాల్సిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అలాగే సినిమా నిడివి విషయంలోనూ కొంత జాగ్రత్త తీసుకుని ఉంటే రిజల్ట్ మరింత మెరుగ్గా ఉండేదనే టాక్ ఉంది. అయినప్పటికీ ఆ మైనస్ పాయింట్స్ ప్రస్తుతం టికెట్ల సేల్స్ పై ప్రభావం చూపుతున్నట్లు కనిపించడం లేదు. అలా నాగబంధం మూవీకి బుక్ మై షోలో కనిపిస్తున్న 68 వేల టికెట్ల ట్రెండ్ సినిమాపై ప్రేక్షకుల్లో ఉన్న ఆసక్తిని చూపిస్తోంది. వీకెండ్‌లో ఇదే జోరు కొనసాగితే నాగబంధం సినిమాకు మరింత ప్లస్ అయ్యే అవకాశంఉంది.

# అంతర్జాతీయ బ్రాండ్ నిర్లక్ష్యం పై త్రిష అసంతృప్తి!



ప్రముఖ అంతర్జాతీయ దుస్తుల బ్రాండ్ జారా పై స్టార్ హీరోయిన్ త్రిష తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. క్వాలిటీ – లగ్జరీకి కేరాఫ్ అడ్రస్‌గా భావించే ఇలాంటి పెద్ద సంస్థలు, వినియోగదారులకు అందించే సేవలలో నిర్లక్ష్యాన్ని ప్రదర్శించడం పట్ల సామాజిక మాధ్యమాల వేదికగా ఘాటుగా స్పందించారు. ఈ బ్రాండ్‌కు సంబంధించి తనకు ఎదురైన ఓ చేదు అనుభవాన్ని త్రిష బహిరంగంగా పంచుకోవడం నెట్టింట హాట్ టాపిక్‌గా మారింది. త్రిష సోషల్ మీడియా ఖాతా ద్వారా జారా బ్రాండ్‌ను నేరుగా ట్యాగ్ చేసి ఆ సంస్థ దుస్తుల నాణ్యతపై తీవ్ర విమర్శలు చేశారు. తాను ఇటీవల ఆ బ్రాండ్ నుండి కొనుగోలు చేసిన కొత్త దుస్తులు దారుణమైన శారీరక దుర్వాసనతో ఉన్నాయని ఆరోపించారు. అత్యంత షాకింగ్ విషయం ఏమిటంటే? ఇలా జరగడం ఇది మొదటిసారి కాదని వరుసగా మూడోసారి కూడా తనకు అదే విధమైన అనుభవం ఎదురైందని త్రిష పేర్కొన్నారు. ప్రతిష్టాత్మక అంతర్జాతీయ సంస్థ అసలు దుస్తుల ప్యాకింగ్ –నాణ్యత పరిశీలన ఎలా చేస్తోందంటూ త్రిష ప్రశ్నించారు. కస్టమర్లు భారీగా డబ్బులు చెల్లించి కొనుగోలు చేసే దుస్తుల విషయంలో ఇలాంటి నిర్లక్ష్యం వహించడం ఏమాత్రం సమంజసం కాదన్నారు. ఎవరో వాడేసి, చెమట వాసన వస్తున్న దుస్తులను .. సరిగ్గా మెయింటైన్ చేయని స్టాక్‌ను మళ్లీ ప్యాక్ చేసి కస్టమర్లకు పంపుతున్నారా? అనే అనుమానాన్ని కలిగించేలా పరిస్థితి ఉందని త్రిష మండిపడ్డారు. దీంతో ఈ వ్యవహారం నెట్టింట సంచలనంగా మారింది. నెటిజన్లు, ఫ్యాషన్ ప్రియులు త్రిష పోస్ట్‌కు పెద్ద ఎత్తున మద్దతు తెలుపుతున్నారు. తాము కూడా గతంలో జారా అవుట్‌లెట్లలో ఆర్డర్లలో ఇలాంటి నాణ్యతా లోపాలను గమనించామని వినియో గదారులు కామెంట్ల రూపంలో తమ అనుభవాలను పంచుకుని త్రిషకు మద్దతుగా నిలుస్తున్నారు. సాధారణంగా పెద్ద సెలబ్రిటీలు బ్రాండ్లతో ఉండే వ్యాపార ఒప్పందాల వల్లనో లేదా వివాదాలెందుకని భావించో ఇలాంటి విషయాలపై బహిరంగంగా మాట్లాడటానికి వెనుకాడుతుంటారు.

కానీ త్రిష ఏమాత్రం వెనకడుగు వేయ కుండా సాధారణ వినియోగదారురాలిగా తనకు జరిగిన అన్యాయాన్ని ..అసౌకర్యాన్ని ప్రశ్నించడం విశేషం. సెలబ్రిటీలు ఇలాంటి లొసుగులను ఎత్తి చూపినప్పుడైనా? అంతర్జాతీయ సంస్థలు తమ సేవలలో మార్పులు చేసుకోవాలని, కస్టమర్ల నమ్మకాన్ని కాపాడుకోవాలని పలువురు అభిప్రాయపడుతున్నారు. త్రిష చేసిన ఈ పోస్ట్‌తో జారా బ్రాండ్ కస్టమర్ సర్వీస్ విభాగం ఏ విధంగా స్పందిస్తుందనేది ఆసక్తికరంగా మారింది.

# పోర్టు కాలుష్యంతో ప్రాణాలు పోతున్న పట్టించుకోరా

## - ఇవి ప్రభుత్వ హత్యలే - పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ మొద్దు నిద్ర వీడాలి - మోకాళ్లపై నడిచి నిరసన తెలిపిన వాసుపల్లి గణేష్ కుమార్








**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** విశాఖ పోర్టు కాలుష్యం వల్ల ఎంతోమంది ప్రమాదకర వ్యాధుల బారిన పడి, మృత్యువాత పడుతున్నారని విశాఖ దక్షిణ వైసీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ ఆరోపించారు. శుక్రవారం జగదంబ జంక్షన్ వద్ద వాసుపల్లి గణేష్ కుమార్ ఆధ్వ ర్యంలో పోర్టు కాలుష్యం వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వ దృష్టికి తెచ్చేందుకు రాష్ట్ర వైఎస్ఆర్సిపి క్రిస్టియన్ మైనార్టీ సెల్ చైర్మన్ జాన్ వెస్లీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొండ రాజీవ్ గాంధీ, దక్షిణ వైసిపి శ్రేణులతో కలిసి మోకాళ్ళతో కూర్చుని వినూత్న ప్రదర్శన నిర్వహించారు. కాలుష్యం వల్ల లంగ్ క్యాన్సర్ తో బాధపడుతున్న వారిని చిత్రీకరించి వీల్ చైర్‌లో కూర్చోబెట్టి తమ వినూత్న నిరసన వ్యక్తం చేశారు. పోర్టు కాలుష్యంతో నరకం అనుభవిస్తున్న మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని చనిపోయి నవారి ఫోటోలు పట్టుకుని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వాసుపల్లి గణేష్ కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతుందని దుమ్మెత్తి పోశారు. అధికారం కోసం ఎంతవరకైనా తెగించే కూటమి నేతలు ప్రజలను పట్టించుకోవడం మానేసారని ఎద్దేవ చేశారు. సంపాదన ధ్యేయంగా పనిచేస్తూ ప్రజల సమస్యలను గాలికి వదిలేసారని దుయ్యబట్టారు. విశాఖ పోర్టు కాలుష్యం వల్ల ఎక్కడ ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కోట వీధి, అంబుసారంగ వీధి, లక్ష్మీ టాకీస్ ప్రాంతం, కొబ్బరి తోట, ప్రసాద్ గార్డెన్, అంబేద్కర్ కాలనీ, భూపేష్ నగర్, లక్ష్మీదేవి పేట, అల్లిపురం, జ్ఞానాపురం, కంచరపాలెం వంటి ప్రాంతాలలో నివాసం ఉంటున్న ప్రజలు ప్రతిరోజు పోర్టు కాలుష్యం వల్ల ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రి ఉన్న సమయంలో, అలాగే జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఇక్కడ ప్రాంత ప్రజలకు కాలుష్య బారిన పడకుండా తగు చర్యలు తీసుకోవడం జరిగిందని చెప్పారు. వైసీపీ ప్రభుత్వంలో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో కాన్వెంట్ జంక్షన్ నుంచి కొబ్బరి తోట వరకు అక్కడ నుంచి సిహార్స జంక్షన్ వరకు అక్కడి నుంచి కోటవీధి వరకు పోర్ట్ నుంచి దుమ్ము ధూళి జనావాసాలలోకి రాకుండా పది మీటర్ల ఎత్తయిన ఐరెస్ వాల్ నిర్మించడం జరిగిందని, అలాగే ఆ పరిసర ప్రాంతాలలో సుమారు నాలుగు లక్షల ట్రీ ప్లాంటినేషన్ చేయడం జరిగిందన్నారు. 250 వాటర్ ట్యాంక్‌లతో పోర్టు కాలుష్య బారిన పడుతున్న ప్రాంతాలను వాటర్ రోడ్లపై స్ప్రింక్లింగ్ చేయడం జరిగిందన్నారు. తన హాయంలో సరైన నిర్వహణ ఉండటం వల్ల కొంతమేర ప్రజలకు ఉపశమనం కలిగిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలను గాలికి వదిలేసిందని ఆరోపించారు. విశాఖ పోర్టు నియమ నిబంధనలకు తిలోదకాలిచ్చిందని దుమ్మెత్తి పోసారు.

పోర్టులో ఓపెన్ ఏరియా స్టాక్ యర్డ్స్ ఉండకూడదని చెప్పారు. ఇటీవల కాలంలో పోర్టు కాలుష్యం మరింత పెరిగి దక్షిణ నియోజకవర్గ ప్రజలకు శాపంగా మారు తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇవన్నీ ప్రభుత్వ హత్యలుగానే భావిస్తున్నామన్నారు. పర్యావరణ శాఖ మంత్రి అయిన పవన్ కళ్యాణ్ విశాఖ పోర్టు కాలుష్యం వల్ల ప్రమాదకర రోగాల బారి నపడి మృతి చెందుతుంటే పట్టించుకోకపోవడం దురదృష్టకరమని మండిపడ్డారు. కార్బన్ మోనాక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్స్, ధర్మకోల్, పెట్రో కెమికల్స్ వంటి వాటి ద్వారా ధూళి జనాభాసాలలో పడటం వల్ల లంగ్ క్యాన్సర్ ఇతర దీర్ఘకాలిక వ్యాధులు వచ్చి ప్రజల ఆసుపత్రులు చుట్టూ తిరుగుతున్నారని తెలిపారు. కొంతమంది ప్రాణాలు కూడా కోల్పోతున్నారని పేర్కొన్నారు. వీటిని ప్రభుత్వ హత్యలుగా పరిగణించాలని అన్నారు. పర్యావరణ శాఖ కూడా చూస్తున్న పవన్ కళ్యాణ్‌కు ప్యాకేజీలు పెద్ద ఎత్తున వస్తున్నట్లు ఉన్నాయని అందుకే ప్రజలు ప్రాణాలు పోతున్న పట్టించుకోవడం లేదని ఆరోపణలు గుప్పించారు. పవన్ కళ్యాణ్‌కు చిత్తశుద్ధి ఉంటే పోర్టు కాలుష్యం వల్ల విశాఖలో ప్రజలు పడుతున్న ఇబ్బందులను తెలుసుకునేందుకు ఒకసారి ఇక్కడికి వచ్చి పరిశీలన చేయాలని డిమాండ్ చేశారు. తమ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇక్కడ ప్రజల కోసం కచ్చితంగా పనిచేస్తామని, తమకు ప్రజల క్షేమమే ముఖ్యమని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో స్టేట్ జాయింట్ సెక్రటరీ లింగం శ్రీను, ఉత్తరాంధ్ర ఎస్సీ సెల్ వైస్ ప్రెసిడెంట్, మాజీ కార్పొరేటర్ చెన్నా జానకిరామ్, మాజీ కార్పొరేటర్లు కోడిగుడ్ల పూర్ణిమ శ్రీధర్, తోట పద్మావతి, బిపిన్ జైన్, వార్డు అధ్యక్షులు నీలపు సర్వేశ్వరరెడ్డి, కోడిగుడ్ల శ్రీధర్, మాజీ కార్పొరేటర్ పచ్చిపల్లి రాము, జిల్లా అనుబంధ సంఘాలు ప్రెసిడెంట్లు సనపల రవీంద్ర, వడ్డది దిలీప్, సకల బత్తుల ప్రసాద్, మహమ్మద్ షరీఫ్, పిల్లా అప్పారావు జిల్లా అనుబంధ సంఘాలు, వార్డ్ అనుబంధ సంఘాల అధ్యక్షులు, దక్షిణ వైసిపి సీనియర్ నేతలు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# జివిఎంసి టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కు 12 వినతులు

## - జీవీఎంసీ చీఫ్ సిటీ ప్లానరు ఎ.ప్రభాకరరావు



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కార్యక్రమంలో 12 వినతులు స్వీకరించడమైనదని జీవీఎంసీ చీఫ్ సిటీ ప్లానరు ఎ.ప్రభాకరరావు తెలిపారు. శుక్రవారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయం తన చాంబర్లో సీపీలు, డీసీపీలు, ఏసీపీలతో కలిసి ప్రత్యేకంగా టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చీఫ్ సిటీ ప్లానరు మాట్లాడుతూ జీవీఎంసీలో ప్రతి శుక్రవారం ప్రత్యేకంగా నిర్వహిస్తున్న "టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్" కార్యక్రమానికి సంబంధించి 12 విన తులు స్వీకరించడం జరిగినదని, అందులో ముఖ్యంగా మధుర వాడ జోన్‌కు 01, ఈస్ట్ జోన్‌కు 05, సౌత్ జోన్‌కు 01, నార్త్ జోన్‌కు 01, వెస్ట్ జోన్‌కు 01, పెందుర్తి జోన్ కు 01, గాజువాక జోన్‌కు 01, అనకాపల్లి జోన్‌కు 01 వినతులు వచ్చాయని తెలిపారు.

స్వీకరించిన వినతులను/ఫిర్యాదులను నిర్ణీత సమయంలో టౌన్ ప్లానింగు అధికారులు వెంటనే స్పందించి పరిష్కరించాలని ఆదేశించడమైనదన్నారు. పట్టణ ప్రణాళికా విభాగమునకు సంబంధించి ఫిర్యాదులు, అర్జీలు మొదలైనవి ప్రతి శుక్రవారం టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరం కార్యక్రమంలో ప్రజలు నమోదు చేసుకోవచ్చునని తెలిపారు.

# యువకుడు అదృశ్యం



**కోవూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు జిల్లా కోవూరు మండలం పోతిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన మునుముడి రాము (31) ఈ ఏడాది జూన్ 24వ తేదీ నుంచి కనిపించకుండా పోయినట్లు కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేసారు. బంధువులు, స్నేహితులు పలుచోట్ల వెతికినప్పటికీ ఆయన ఆచూకీ లభించలేదని పేర్కొన్నారు. దీంతో కుటుంబ సభ్యులు ప్రజల సహాయాన్ని కోరుతున్నారు. మునుముడి రాము ఆచూకీ తెలిసిన వారు వెంటనే 95550 551360 నంబర్‌కు సంప్రదించాలని లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేశారు.

# ఇండియన్ క్రిస్టియన్ డే లో రక్తదాన శిబిరం



**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** ఇండియన్ క్రిస్టియన్ డే పురస్కరించుకుని పెద్దాపురం రోటరీ బ్లడ్ బ్యాంకునందు క్లాప్స్ సంస్థ వ్యవస్థాపకులు రెవ. డాక్టర్ పురుషోత్తం దాస్ లంక ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పురుషోత్తమ దాసు మాట్లాడుతూ ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయడంవల్ల ఆరోగ్యానికి మంచిదని, ఒక యూనిట్ రక్తంద్వారా ఒక వ్యక్తి ప్రాణం కాపాడగలిగినవారము అవుతాయన్నారు. ఇండియన్ క్రిస్టియన్ డే సందర్భంగా పెద్దాపురం క్లాప్స్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, పెద్ద ఎత్తున క్రైస్తవ సోదరులు పాల్గొని రక్తదానం చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బిషప్ సీబీఐ సుకుమార్, రెవ. సత్యానందనం, రెవ. ఎల్ జ్ఞానానందనం, రెవ. నాగ శ్రీనివాస్ (జేమ్స్), రెవ. జిఎస్.ప్రకాశ్‌రావు, పాస్టర్ ఎన్ సుకుమార్ సహాయం, పెద్ద ఎత్తున క్రైస్తవ సోదరులు పాల్గొన్నారు.

# అందరి బాధ్యతగా పర్యావరణ పరిరక్షణ : ఎమ్మెల్యే



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** పర్యావరణ పరిరక్షణ అందరి భాధ్యత అని దానికి కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పిలుపునిచ్చారు. శుక్రవారం సామర్లకోట మఠం సెంటర్ వద్ద దుర్గాప్ర సాద్ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ సంతోష్, ప్రిన్సి పాల్ వంశీ ప్రియాంక, పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బడుగు శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పర్యావరణ దినోత్సవ వేడుకలను ఘనంగా ప్రారంభించారు. ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎమ్మెల్యే చినరాజప్ప కోరారు. దుకాణదారులు ప్లాస్టిక్ కవర్లను విడిచి, గుడ్డ సంచులు తీసుకునేలా ప్రజలను ప్రోత్సహించాలన్నారు. ప్లాస్టిక్ కారణంగా అత్యంత ప్రమాద పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఎమ్మెల్యే చినరాజప్ప వివరించారు. తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు నిమ్మకాయల రంగనాగ్ మాట్లాడుతూ ఇంటింటా ఒక్కొక్క మొక్కను నాటితే గ్రామాలు, పట్టణాలు వనాలుగా మారుతాయని, ఆ దిశగా ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. దుర్గాప్ర సాద్ పాఠశాల అందించిన 500 మొక్కలను ప్రజలకు ఎమ్మెల్యే చినరాజప్ప, ప్రజాప్రతినిధులు, ప్రజలకు, దుకాణదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు అడబాల కుమారస్వామి, గౌడ్ కార్పొరేషన్ డైరెక్టర్ బడుగు శ్రీకాంత్, కంటే జగదీష్ మోహన్, యార్లగడ్డ రవిచంద్ర ప్రసాద్, కొండపల్లి శ్రీనివాస్, అరుణ్ వంశీ, గంగాధర్, సోమేశ్వరరావు మాస్టర్, సీఐ ఎ కృష్ణ భగవాన్, ట్రాఫిక్ ఎస్ఐ అడపా గరగారావు తదితరులు పాల్గొన్నారు.

# కాలానుగుణ రుగ్మతలకు ఆయుర్వేదంతో ఉపశమనం : డాక్టర్ హేమాక్షి



**పార్వతీపురం, (రాజధాని వార్తలు):** సీతానగరం మండలం కాలానుగుణంగా ప్రబలే రుగ్మతలకు ఆయుర్వేదంతో మెరుగైన ఫలితాలు ఉంటాయని బూర్జ, ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల వైద్యాధికారిణి డాక్టర్ టి.హేమాక్షి పేర్కొన్నారు. ఈ మేరకు సుమిత్రాపురంలో శుక్రవారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో డాక్టర్ హేమాక్షి పలువురికి ఆరోగ్య తనిఖీలు నిర్వహించారు. ముఖ్యంగా వాత వ్యాదులు, దగ్గు, పడిశము, ఆస్తమా, జీర్ణకోశ సమస్యలు, చర్మ సంబంధిత సమస్యలకు పరీక్షించి ఆయుర్వేద మందులు అందజేశారు. అలాగే మందులు వినియోగించే విధానాన్ని వివరించారు. అనంతరం డాక్టర్ హేమాక్షి మాట్లాడుతూ ప్రస్తుత వర్షాకాలం నేపధ్యంలో ఆరోగ్యం పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కాచి చల్లార్చిన నీరు తాగాలని, సాధ్యమైనంతవరకు వేడిగా ఆహార పదార్థాలు తీసుకోవాలని, ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, చేతులు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు.

గ్రామాల్లో ఆయుర్వేద వైద్య శిబిరాలు నిర్వహిస్తూ వైద్య సేవలు అందిస్తున్నామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ స్టాఫ్ హైమావతి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

# బాలల ఆరోగ్య వికాసానికి డిఇఐసి ఉత్తమ మాధ్యమం

## కావాలి : ఆర్.బిఎస్.కె పిఓ డాక్టర్ జగన్ మోహన్



**పార్వతీపురం, (రాజధాని వార్తలు):** బాలలకు ఆరోగ్యకరమైన భవిష్యత్ అందజేయడమే లక్ష్యంగా కృషి చేయాలని జిల్లా ఆర్.బిఎస్.కె అధికారి డాక్టర్ టి. జగన్ మోహనరావు డిఇఐసి వైద్యులు, సిబ్బందికి సూచించారు. జిల్లా కేంద్రంలో గల బాలల సత్వర చికిత్సా కేంద్రాన్ని (డిఇఐసి) శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి ప్రతీ రోజూ ఎంత మంది బాలలకు వైద్య సేవలు అందిస్తున్నారు, 4డి సమస్యలైన శారీరక, మానసిక వైకల్యాలు, ఎదుగుదల లోపాలు, జాప్యంలకు కేంద్రంలో అందిస్తున్న చికిత్సా, థెరపీ, ఎర్లీ ఇంటర్వెన్సన్స్, ఉపకరణాల ద్వారా ఏమేరకు మెరుగు పడుతున్నాయి వివరాలపై పరిశీలించారు. మానసిక ఎదుగుదల లోపంతో అక్కడ థెరపీ పొందుతున్న బాలుని తో ఆయన మాట్లాడి మెరుగు తీరును గమనించారు. కేంద్రంలో పరికరాల పనితీరు పరిశీలించారు. డాక్టర్ జగన్ మాట్లాడుతూ అనువంశికంగా లేదా ఎదుగుదల క్రమంలో వివిధ కారణాలచే పిల్లలో శారీరక, మానసిక వైకల్యాలు, లోపాలు, ఎదుగుదలలో జాప్యం, వ్యాదులు సంభవించవచ్చని వీటిలో డౌన్స్ సిండ్రోమ్, గ్రహణ మొర్రి, వంకర పాదాలు, వినికిడి లోపం, సి.హెచ్.డి గుండె జబ్బులు, రేటినోపతి అలాగే ఎదుగుదల కారణాలలో లోపాలైన మాటలు నేర్చుకోవడంలో ఆలస్యం, ఆటిజం, దృష్టి సమస్యలు, జ్ఞాన పరంగా వృద్ధి ఆలస్యం మొదలగు సమస్యలను క్షేత్ర స్థాయిలో వైద్యులు,సిబ్బంది త్వరగా గుర్తించి డిఇఐసి కేంద్రానికి చేర్చాలని ఇందుకు ఆర్.బి ఎస్.కె ఉచిత వాహనాన్ని సద్వినియోగం చేయాలన్నారు. ఇక్కడ చికిత్స, థెరపీల ద్వారా చాలా వరకు సమస్య నుండి మెరుగుపడేందుకు వైద్యులు,సిబ్బంది కృషి చేయాలని తద్వారా బాలల భవిష్యత్ జీవన ప్రమాణాలు మెరుగుపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో డెంటల్ వైద్యులు డా కె. సౌజన్య, సైకాలజిస్ట్ కృష్ణవేణి, ఆప్తమెటిస్ట్ స్వాతి, ఇంటర్వెన్సెన్ కౌన్సిలర్ స్రవంతి, స్టాఫ్ నర్స్ సిబ్బంది ఉన్నారు.

# చట్టపరమైన చర్యలు తీసుకోండి

## - ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మ




**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరులోని డిప్యూటీ కమిషనర్, ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ కార్యాలయంలో నేర సమీక్షపై ప్రొహిబిషన్ & ఎక్సయిజ్ శాఖ డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పరిధిలోని ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ స్టేషన్ల వారీగా నమోదైన కేసుల వివరాలను సమీక్షించి, అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ క్రింది అంశాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని ఆదేశించారు. ఇతర రాష్ట్రాల నుంచి జిల్లాలోకి అక్రమ మద్యం రాకుండా పటిష్ఠమైన చర్యలు చేపట్టాలని సూచించారు. నేరాల ప్రాబల్యం అధికంగా ఉన్న ప్రాంతాల్లో నమోదైన కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలి. జిల్లాలో నాటుసారా తయారీ, రవాణా మరియు విక్రయాలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలి అన్నారు. బెల్టు దుకాణాలు మరియు బహిరంగ మద్యపానాన్ని అరికట్టేందుకు కఠినంగా వ్యవహరించాలని చెప్పారు. ప్రస్తుత మద్యం దుకాణాల లైసెన్సుల గడువు మరో మూడు నెలలు మాత్రమే ఉన్నందున, లైసెన్సు ఫీజుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు, మద్యం దుకాణాలలో ఎటువంటి అనధికార సరుకు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలి అన్నారు. పెండింగ్‌లో ఉన్న దర్యాప్తు కేసులలో త్వరితగతిన చార్జ్ షీట్లు దాఖలు చేయాలి. గంజాయి అక్రమ రవాణా మరియు వినియోగాన్ని కట్టడి చేయడంతో పాటు, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా మాత్రమే మద్యం క్రయవిక్రయాలు జరిగేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. ఇతర రాష్ట్రాలలో అరెస్టు కావలసిన ముద్దాయిలను త్వరితగతిన అరెస్టు చేసి, సంబంధిత కేసులలో చార్జ్ షీట్లు దాఖలు చేయాలని సూచనలు ఇచ్చారు. ఎన్‌డీపీఎస్, గంజాయి మరియు ఇతర కేసుల ముద్దాయిలను తహసీల్దార్ల ఎదుట బైండోవర్ చేయుటకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్, ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్, నెల్లూరు జిల్లా ఎం.శంకరయ్య, సహాయ కమిషనర్, ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్, నెల్లూరు జిల్లా పి.దయాసాగర్ నెల్లూరు జిల్లాలోని 11 ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

# హెల్మెట్ అవగాహన ర్యాలీ నిర్వహించిన కాకినాడ జిల్లా పోలీసులు



**కాకినాడ, (రాజధాని వార్తలు):** కాకినాడ జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్, ఐపీఎస్ ఆదేశాల మేరకు రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా ద్విచక్ర వాహనదారుల్లో హెల్మెట్ వినియోగంపై అవగాహన పెంపొందించేందుకు సామర్లకోట పట్టణంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పెద్దాపురం డీఎస్పీ ఏ.బి.జి. తిలక్ ఆధ్వర్యంలో సామర్లకోట గడియారం సెంటర్ వద్ద టూ వీలర్ మెకానిక్స్ సంఘం సహకారంతో హెల్మెట్ అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం సుమారు 100 మంది ద్విచక్ర వాహనదారులు హెల్మెట్లు ధరించి అవగాహన ర్యాలీలో పాల్గొన్నారు. ఈ ర్యాలీ గడియారం సెంటర్ నుండి మెహర్ కాంప్లెక్స్, హనుమాన్ టెంపుల్, సామర్లకోట గ్రౌండ్ సెంటర్, బాలాజీ మార్కెట్ మీదుగా తిరిగి గడియారం సెంటర్ వరకు నిర్వహించబడింది. ఈ సందర్భంగా ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా నాణ్యమైన హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రాణాలను కాపాడుకోవడంతో పాటు రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సామర్లకోట ఇన్‌స్పెక్టర్ శ్రీ ఏ.కే.భగవాన్, ఎస్సైలు ఎస్.ఎస్.మూర్తి, రాజా, ట్రాఫిక్ ఎస్సై ఎ గరగారావు, పోలీసు సిబ్బంది, టూ వీలర్ మెకానిక్స్ సంఘం అధ్యక్షుడు ఈ.రాము మరియు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# జనసేన 'నిర్మాణ సారథుల' ప్రక్రియ విజయవంతం కావాలి

## - కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ఆకాంక్ష - ఎమ్మెల్యేని మర్యాదపూర్వకంగా కలిసిన ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** కోవూరు శాసనసభ్యులు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిని జనసేన పార్టీ నిర్మాణ సారథుల సమాచార సేకరణ కమిటీ నెల్లూరు పార్లమెంట్ అబ్జర్వర్‌గా నియమితులైన నర్సాపురం జనసేన ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్ మర్యాదపూర్వకంగా ప్రశాంతి రెడ్డిని కలిశారు. జూన్ 29 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా 25 పార్లమెంట్ నియోజకవర్గాల్లో జనసేన పార్టీ నిర్మాణ సారథుల సమాచార సేకరణ కమిటీలు పని చేస్తున్నాయి. ఈ సందర్భంగా బొమ్మిడి నాయకర్ నెల్లూరులో పర్యటిస్తున్నారు. పంచాయతీ స్థాయి నుంచి పార్లమెంట్ స్థాయి వరకు జనసేన పార్టీ బాధ్యతలతో పాటు, వివిధ అనుబంధ విభాగాల్లో సేవలందించాలనే ఆసక్తి ఉన్న జనసేన సాధకులు, నాయకులు, జనసైనికులందరికీ ఈ ప్రక్రియలో భాగస్వామ్యమయ్యే అవకాశం కల్పిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పారదర్శకంగా నిర్వహిస్తున్న జనసేన పార్టీ నిర్మాణ సారథుల సమాచార సేకరణ కమిటీ ప్రక్రియ విజయవంతం కావాలని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జనసేన నేత గుడి హరిరెడ్డి తదితరులు ఉన్నారు.

# కోవూరు 13వ వార్డులో ఓటర్ల వెరిఫికేషన్‌లో నాటకరాణి వెంకట్





**కోవూరు, (రాజధాని వార్తలు):** కోవూరు పట్టణములో 13వ వార్డులో జరిగిన ఓటర్ల రీ వెరిఫికేషన్‌లో ఐటీడిపి సీనియర్ నేత నాటక రాణి వెంకట్ పాల్గొన్నారు.

కోవూరు నియోజకవర్గ శాసన సభ్య రాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ఆదేశాల మేరకు కోవూరు గ్రామ పంచాయతీ పరిధిలోని 13వ వార్డు 135వ బూత్‌లో సర్ ఓటర్లు వెరిఫికేషన్‌లో భాగంగా సచివాలయం సిబ్బంది షేక్ అహ్మద్ ఉన్నిసాతో కలిసి ఇంటింటికి తిరిగి వెరిఫికేషన్ చేస్తున్న కోవూరు నియోజకవర్గం ఐటీడీపీ సీనియర్ నాయకులు మరియు 135 బూత్ కన్వీనర్ నాటకరాణి వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

# రామతీర్థం శ్రీ రామలింగేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించాలి

## - జులై 6 నుంచి 14 వరకు ఉత్సవాలు - అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి - భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా వసతులు కల్పించాలి - సముద్ర తీర ప్రాంతం కావడంతో కట్టుదిట్టమైన బందోబస్తు అవసరం : కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి





**నెల్లూరు /రామతీర్థం, (రాజధాని వార్తలు):** శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా విడవలూరు మండలం రామతీర్థం గ్రామంలో వెలసిన శ్రీకామాక్షిదేవి సమేత శ్రీరామలింగేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలను భక్తిశ్రద్ధలతో, వైభవంగా, ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోవూరు శాసనసభ్యులు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి సూచించారు జూలై 6వ తేదీ నుంచి 14వ తేదీ వరకు జరగనున్న బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై నెల్లూరులోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఆలయ కమిటీ సభ్యులు, అధికారులు, నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ.. గత రెండు సంవత్సరాలుగా కోవూరు నియోజకవర్గంలో నిర్వహిస్తున్న ప్రతి ఉత్సవ కార్యక్రమంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని వసతులు కల్పిస్తూ, సామాన్యులకు పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. కోవూరు నియోజకవర్గంలో జొన్నవాడ శ్రీ కామాక్షి అమ్మవారి ఆలయం, చాముండేశ్వరి అమ్మవారి ఆలయం, రామతీర్థం శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయం వంటి విశిష్టమైన దేవాలయాలు ఉండటం ఈ ప్రాంత ప్రజల అదృష్టమని పేర్కొన్నారు. బ్రహ్మోత్సవాలు జులై 6న శేషవాహన సేవతో ప్రారంభమవుతాయని, అనంతరం 7న చిలుక వాహనం, 8న హంస వాహనం, 9న పులివాహనం, 10న రావణ సేవ, 11న నంది సేవ, 12న రథోత్సవం, 13న కళ్యాణోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. 14వ తేదీన తీర్థవారి (సముద్రస్నానం), రాత్రి తెప్పోత్సవంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని వెల్లడించారు. ఉత్సవాల నిర్వహణలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు ముందుగానే సమన్వయంతో ప్రణాళికలు రూపొందించి, శాస్త్రోక్తంగా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ముఖ్యంగా సముద్ర తీర ప్రాంతం కావడంతో భక్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని పోలీసు శాఖకు ఆదేశించారు. ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక దర్శనాల కోసం క్యూలైన్లు ఏర్పాటు చేయడంతో పాటు దేవస్థానంలో నిరంతర తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ, ఇతర మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్ శాఖ అధికారులు ఉత్సవాల సమయంలో ఎలాంటి అంతరాయం లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా అందించడంతో పాటు, విద్యుత్ తీగలు లేదా ఇతర సాంకేతిక సమస్యలు తలెత్తకుండా సిబ్బందిని ఎల్లప్పుడూ ఆలయ పరిసరాల్లో అందుబాటులో ఉంచాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు, స్థానిక నాయకులు సమన్వయంతో పనిచేసి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ఆదేశించారు. ఈ సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షులు హరి రెడ్డి, టీడీపీ నాయకులు బెజవాడ వంశీరెడ్డి, అడపాల శ్రీధర్ రెడ్డి, మాజీ ఏ ఎం సీ చైర్మెన్ అచ్యుత్ రెడ్డి, పాశం శ్రీహరి రెడ్డి, ఆవుల వాసు, ఆలయ చైర్మన్ సురేష్ కృష్ణ, కమిటీ సభ్యులు తాతా రమేష్, కటారి సుబ్రహ్మణ్యం అధికారులు, టీడీపీ కూటమి నేతలు, తదితరులు పాల్గొన్నారు.

# ఆణిముత్యాలు గిరి పుత్రులకు పంపిణీ చేసే పురస్కార వేదికలో పాల్గొననున్న ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి



**నెల్లూరు /కోవూరు, (రాజధాని వార్తలు):** జూలై 5వ తేదీ నెల్లూరు టౌన్ హాల్ నందు జులై 5న జరగనున్న ప్రతిభా పురుష్కరాలు గిరిజన విద్యా చైతన్య నివేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గిరిజన యానాది ఆణిముత్యాలు ప్రతిభ పురస్కారాలు అవార్డు కార్యక్రమానికి కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి హాజరు కానున్నట్లు విశ్వసనీయ సమాచారం. రాష్ట్ర గిరిజన (యానాది) విద్యా చైతన్య వేదిక యువజన విభాగ అధ్యక్షులు లోక్ సాయి కోవూరు టిడిపి ఎస్టీ సెల్, నేతలు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసినట్లు చెప్పారు. ఆమె సానుకూలంగా స్పందించి నందుకు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

# పిడుగుపాటు బాధితులకు ఎమ్మెల్యే ప్రశాంతమ్మ కొండంత అండ

## - టీడీపీ సీనియర్ నేత, వంశీ, బాషా యూత్ ఫౌండేషన్ చైర్మెన్ వనమాల జనార్ధన్ రావు






**విడవలూరు, (రాజధాని వార్తలు):** ఊటుకూరులో ఇటీవల పిడుగుపాటుకు కోనేరు బాలచంద్ర ఇంట్లో పలు పరికరాలు దెబ్బతిన్న సంఘటన పాటకులకు తెలిసిందే. టీడీపీ సీనియర్ నేత బెజవాడ వంశీ కృష్ణ రెడ్డి. బాషా యూత్ ఫౌండేషన్ చైర్మెన్ వనమాలలు జనార్దన్ రావు సంయుక్తంగా మాట్లాడుతూ ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ద్రుష్టికి వెళ్ళగానే స్పందించి బాధితులకు 30 వేల రూపాయలు కోనేరు కుటుంబంకు అందచెయ్యడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు హర్షం వ్యక్తం చేసారు.

# RAJADHANI CLASSIFIEDS Ad. Call
## 9440662699, rajadhanivartalu.com

### EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యస్ ఆర్ ఐ అకాడమీ అఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- , అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

### HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యం.ఏ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

### MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్: 1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

### REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

### NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ టి.రమేష్, మంగళగిరి 0863-999999

### RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

### COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎక్ట్రానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్స్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి పాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శ్రీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్సపోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699



# పేద ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

## - గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్



**గూడూరు, (రాజధాని వార్తలు):** పార్టీలకతీతంగా పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడమే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం ప్రభుత్వ ఫలాలను అందిస్తున్నారని గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే రాష్ట్ర టిడిపి ప్రధాన కార్యదర్శి డాక్టర్ పాశిం సునీల్ కుమార్ పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం గూడూరు నియోజకవర్గంలో ఇప్పటి వరకు 6 కోట్ల 70 లక్షల రూపాయలు సీఎం సహాయ నిధి అందించడం జరిగిందని గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ వెల్లడించారు. గూడూరు పట్టణం లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎం సహాయ నిధి నుండి మంజూరైన 24 లక్షల 96 వేల రూపాయల 56 చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్, నాయకులతో కలిసి అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదవాడు అనారోగ్యంతో అప్పులు చేసి వైద్యం చేయించుకున్న వారికి సీఎం ఆర్థిక సహాయం వరంలా ఉందని గత వైసిపి ప్రభుత్వంలో ఒక్కరికి కూడా సీఎం సహాయ నిధి ద్వారా ఏమి ఇవ్వలేదని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన రెండు సంవత్సరాల లోనే ఆరు కోట్లకు పైగా సీఎం సహాయ నిధి గూడూరు నియోజక వర్గంలో అందించామని తెలిపారు. పనిచేసే ప్రభుత్వాన్ని ప్రజలు గుర్తుంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి నాయకులు కిరణ్ కుమార్, భాస్కర్ రెడ్డి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బిల్లు చెంచురామయ్య, జిల్లా అధికార ప్రతినిధి అబ్దుల్ రహీం, గూడూరు పట్టణ, రూరల్ అధ్యక్షులు శ్రీనివాసులు, వెంకటేశ్వరరాజు, పలు మండలాల నాయకులు లబ్ధిదారులు పాల్గొన్నారు.

# కరపలో వైభవంగా నూతన రథం ప్రారంభోత్సవం





**కరప, (రాజధాని వార్తలు):** కాకినాడ జిల్లా కరప గ్రామంలో స్థానిక విష్ణాలయంలో భక్తులు, గ్రామస్థుల సహకారంతో నిర్మించిన నూతన రథాన్ని శుక్రవారం వేద మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల నడుమ శాస్త్రోక్తంగా ప్రారంభించారు. అనంతరం స్వామివారి ఉత్సవమూర్తులను రథంపై అధిష్ఠింపజేసి గ్రామ పురవీధుల్లో నిర్వహించిన గ్రామ సేవ రథోత్సవం భక్తుల హర్షధ్వానాలు, భజనలు, గోవింద నామస్మరణల మధ్య అత్యంత వైభవంగా సాగింది. కరప మండలం స్థానిక విష్ణాలయంలో భక్తులు, గ్రామస్థుల సహకారంతో సుమారు రూ.7 లక్షల వ్యయంతో సంపర కళాకారుడు మెహర్‌బాబా (దొరబాబు) బృందం రూపొందించిన నూతన రథం శుక్రవారం అత్యంత వైభవంగా ప్రారంభమైంది. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణంలో భక్తిశ్రద్ధల నడుమ ఘనంగా సాగింది. గ్రామంలోని ప్రధాన దేవాలయాల ఉత్సవమూర్తుల గ్రామసేవ కోసం ప్రత్యేకంగా నిర్మించిన ఈ రథానికి ఉదయం నుంచి వేద పండితులు వేదమంత్రోచ్ఛారణల మధ్య శాస్త్రోక్తంగా సంప్రోక్షణ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవాయిద్యాల నడుమ జరిగిన పూజా కార్యక్రమాలు మధ్యాహ్నం వరకు కొనసాగాయి. అనంతరం ఆలయానికి విచ్చేసిన భక్తులకు అల్పాహార ప్రసాదాన్ని పంపిణీ చేశారు. సాయంత్రం స్వామివారి ఉత్సవ మూర్తులను నూతన రథంపై అధిష్ఠిం పజేసి, కరప సీతారామ నాట్యమండలి వారి కోలాటం నృత్యాలతో గ్రామ పురవీధుల్లో గ్రామసేవ రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భజనలు, గోవింద నామస్మరణలు, మంగళహారతుల మధ్య సాగిన రథోత్సవంలో స్వామివారు భక్తులకు దర్శనమివ్వగా, పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులు, మహిళలు, యువకులు, పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని నూతన రథ ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేశారు.

# పాఠశాలకు భోజన కంచాలు బహుకరణ

## - విద్యార్థులను టీవీలకు, సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉంచాలి



**అల్లవరం, (రాజధాని వార్తలు):** విద్యతోనే ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని, తల్లిదండ్రులు తమ పిల్లలను సెల్ ఫోన్‌లకు, టీవీలకు దూరంగా ఉంచాలని విశ్రాంత ఉపాధ్యాయుడు, మోసుగంటి గంగయ్య మెమోరియల్ ఎడ్యుకేషనల్ అండ్ ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు మోసుగంటి వెంకటేశ్వరరావు అన్నారు. అల్లవరం మండలం బెండమూర్లంక మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశా లకు మోసుగంటి గంగయ్య మెమోరియల్ ఎడ్యుకేషనల్ అండ్ ఛారిటబుల్ ట్రస్ట్ కొమరగిరిపట్నం వారిచే విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేయడానికి స్టీల్ కంచాలను అందజేశారు. పిల్లల భవిష్యత్తు తీర్చిదిద్దటంలో తల్లిదండ్రుల పాత్ర కీలకమని తమ పిల్లలను ఎప్పటికప్పుడు గమనిస్తూ సెల్ ఫోన్‌లకు బానిస కాకుండా చదువు పట్ల ఆసక్తిని పెంచేలా తీర్చిదిద్దాలని తల్లిదండ్రులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు యస్.సత్యనారాయణ, ట్రస్ట్ అధ్యక్షులు మోసుగంటి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు కుసుమ రమేష్ బాబు, రుద్రరాజు రమేష్ రాజు, విద్యా కమిటీ ఛైర్మన్ ముసునూరి భవాని, ఉపాధ్యాయురాలు దుర్గాభవాని, చుట్టుగుళ్ళ రాముడు, గ్రామ పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. మోసుగంటి గంగయ్య ట్రస్ట్ సేవలను ప్రధానోపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు కొనియాడారు.

# మరిడమ్మ అమ్మవారికి విశేష పూజలు



**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** పెద్దాపురం పట్టణంలో వేంచేసి ఉన్న శ్రీ మరిడమ్మ అమ్మ వారి ఆలయంలో అమ్మవారికి బంగారు వెండి పుష్పాలతో శుక్రవారం విశేష పూజలు చేపట్టారు. ఆలయ కార్యనిర్వహణ అధికారిణి, దేవాదాయ సహాయ కమిషనర్ కే విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఆలయ పండితులు ఉదయం అమ్మవారికి పంచామృత అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేకరీతిలో అలంకరించి బంగారు వెండి పుష్పాలతో విశేష పూజలు నిర్వహించారు. ఈ పూజలు తిలకిం చేందుకు వచ్చిన భక్తులకు ఆలయ సిబ్బంది ప్రత్యేక ప్రసాదాలు అందించి ఆశీర్వదించారు. ప్రతి శుక్రవారం నిర్వహించే పూజల్లో భాగంగా జరిగిన ఈ పూజల్లో ఆలయ సిబ్బంది, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan